




# విజయభాను




విశాఖపట్నం, శనివారం 31-12-2023 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 48 సంచిక : 92 పేజీలు : 08 వెల : 1 రూపాయి


## జనవరి 22 కోసం ప్రపంచం ఎదురుచూస్తోంది

### అయోధ్య ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ



అయోధ్య: ఉత్తరప్రదేశ్ ని అయోధ్య లో మరికొద్ది రోజుల్లో రామమందిర ప్రారంభోత్సవం అట్టహాసంగా జరగనుంది. ఆ మహత్కార్యం కోసం యావత్ ప్రపంచం ఎదురుచూస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. శనివారం అయోధ్య పర్యటనలో ఉన్న ప్రధాని.. ఈ ఆధ్యాత్మిక నగరంలో నూతనంగా నిర్మించిన మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. "అయోధ్య విమానాశ్రయానికి.. త్రికాలదర్శి అయిన మహర్షి వాల్మీకి పేరు పెట్టడం జన్మధన్యంగా భావిస్తున్నా. రోజుకు 10 లక్షల మందికి సేవలు అందించేలా ఈ ఎయిర్‌పోర్టును నిర్మించాం. రద్దీ మేరకు రహదారులు విస్తరిస్తాం. అయోధ్యధామ్‌లో ఎక్కడ చూసినా రామనామం వినిపించాలి. ఇక్కడకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు అన్ని వసతులతో టౌన్‌షిప్‌లు నిర్మిస్తున్నాం" అని వెల్లడించారు. అనంతరం వచ్చే నెల జరగబోయే రామమందిర ప్రారంభోత్సవంపై ప్రధాని మాట్లాడారు. "2024 జనవరి 22వ తేదీన అయోధ్యలో జరిగే ప్రాణప్రతిష్ఠ కోసం ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూస్తోంది. హిందుస్థాన్ చరిత్రలో జనవరి 22 విశిష్ఠమైన రోజుగా నిలుస్తుంది. ఆ రాత్రి దేశంలోని ప్రతి ఇంటా రామ జ్యోతి వెలిగించాలి. ఒకప్పుడు రామ్ లల్లా టెంట్‌లో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పుడు ఆయనకు పక్కా ఇంటిని అత్యంత సుందరంగా నిర్మించాం. ఆయనతో పాటు దేశంలో 4 కోట్ల మందికి మేం పక్కా గృహాలు కట్టించాం" అని మోదీ తెలిపారు.

#### జనవరి 23 నుంచి రండి..

ఈ సందర్భంగా భక్తులకు ప్రధాని కీలక సూచన చేశారు. "జనవరి 22న ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా తిలకించాలని అందరూ కోరుకుంటారు. కానీ, అది అందరికీ సాధ్యపడదని మీకు తెలుసు. అందుకే,

తరువాయి 2లో..

## జనవరి 1న నింగిలోకి పిఎస్ఎల్వి సి-58



సూళ్లూరుపేట : అంతరిక్ష పరిశోధనలో అగ్రరాజ్యాలకు దీటుగా దూసుకుపోతున్న ఇస్రో 2024 జనవరి 1న మరో కీలక ఉపగ్రహ ప్రయోగానికి సిద్ధమయింది. శ్రీహరికోటలోని ఫస్ట్ లాంచ్ ప్యాడ్ నుంచి పిఎస్ఎల్వి-సి 58 రాకెట్ ప్రయోగిస్తున్నారు. దీని ద్వారా 480 కిలోల బరువు ఉన్న ఎక్స్‌పో శాట్‌ను, కేరళ యూనివర్సిటీ విద్యార్థులు రూపొందించిన ఒక కేజీ బరువున్న వీఐవై శాటును కూడా కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు. గత ఏడాది వరసగా ఎనిమిది రాకెట్ల ప్రయోగాలు శ్రీహరికోట నుంచి శాస్త్రవేత్తలు విజయవంతంగా చేపట్టారు. 2024 కూడా సక్సెస్‌తో ఈ రాకెట్‌ను గురి తప్పకుండా విడిచి పెట్టాలని ఆశిస్తున్నారు. ఇందుకు సంబంధించి ఇస్రో సందర్శకులను ఆహ్వానించింది. ఆన్లైన్ ద్వారా షార్‌లోని విజిటర్స్ గ్యాలరీ నుంచి వీక్షకులను దరఖాస్తులు ఆహ్వానించింది. ఇదిలా ఉంటే ఐదేళ్ల జీవితకాలం కలిగిన

తరువాయి 2లో..

## ప్రకాశం బ్యారేజ్‌కు 2023లో ప్రపంచ గుర్తింపు




విజయవాడ, (విజయభాను న్యూస్) : దక్షిణ భారత దేశంలోని పలు కట్టడాలు, ప్రదేశాలు 2023 సంవత్సరంలో ప్రపంచ సాంస్కృతిక, వారసత్వ సంపదగా గుర్తింపు పొందాయి. వీటిలో ఆంధ్రప్రదేశ్ విజయవాడలోని ప్రకాశం బ్యారేజ్ ఒకటి. ది ఇంటర్నేషనల్ కమిషన్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజి(ఐసీఐడీ)ప్రకాశం బ్యారేజ్‌ను 2023లో ప్రపంచ వారసత్వ ఇరిగేషన్ నిర్మాణంగా ప్రకటించింది.విశాఖపట్నంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఐసీఐడీ అధ్యక్షుడు వరల్డ్ హెరిటేజ్ ఇరిగేషన్ స్ట్రక్చర్(డబ్ల్యూహెచ్ఐఎస్) అవార్డును ఆంధ్రప్రదేశ్‌కు అందించారు.ఇప్పటివరకు భారత దేశానికి 14 డబ్ల్యూహెచ్ఐఎస్ అవార్డులు రాగా వీటిలో ఆంధ్రప్రదేశ్‌ను నాలుగు అవార్డులు వరించాయి.

## ఏపీలో ఇళ్ల నిర్మాణం పేరిట భారీ కుంభకోణం..

### ప్రధాని మోదీకి పవన్ లేఖ



అమరావతి: ఏపీలో ఇళ్ల నిర్మాణం పేరిట భారీ కుంభకోణం జరిగిందని, దీనిపై సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధాని మోదీకి ఆయన 5 పేజీల లేఖ రాశారు "వైకాపా పాలనలో భూసేకరణ పేరిట రూ.32,141 కోట్ల నిధులు దుర్వినియోగం చేశారు. ఇళ్ల పట్టాలు, నిర్మాణంపై ప్రభుత్వం భిన్న ప్రకటనలు చేస్తోంది. సీబీఐ వంటి సంస్థలతో దర్యాప్తు చేయిస్తే వాస్తవాలు తెలుస్తాయి. అధికార పార్టీ ఎమ్మెల్యేలు భూ సేకరణలో కీలకంగా వ్యవహరించారు.

గతంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను కూడా పూర్తిగా లబ్ధిదారులకు ఇవ్వలేదు. 6.68 లక్షల టిడ్కో ఇళ్లు పూర్తయితే 86,984 మందికే ఇచ్చారు. ప్రభుత్వం తీరుతో మిగతా లబ్ధిదారులు విసుగుచెందారు" అని పవన్ తన లేఖలో పేర్కొన్నారు.

## కుప్పంలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించిన చంద్రబాబు



కుప్పం: చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవకర్గంలో తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు మూడో రోజు పర్యటన కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి బస్టాండ్ కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను ఆయన ప్రారంభించి స్వయంగా భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా భారీగా తరలివచ్చిన ప్రజలనుద్దేశించి చంద్రబాబు ప్రసంగించారు. "ప్రజల ఉత్సాహం చూస్తుంటే వైకాపాను గద్దె దించడానికి సిద్ధంగా ఉన్నారని అనిపిస్తోంది. గతంలో ఎన్నడూ లేని ఉత్సాహాన్ని చూస్తున్నా. 35 ఏళ్లలో చేసిన అభివృద్ధి కంటే రాబోయే రోజుల్లో కుప్పం నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తా. గ్రానైట్ పరిశ్రమ అభివృద్ధి కోసం ప్రత్యేక పార్క్ ఏర్పాటు చేస్తాం. లక్ష మెజారిటీ ఇచ్చి కుప్పం స్థాయిని మరోసారి చాటిచెప్పండి. రాష్ట్రం కోసం యువత ముందుకు రావాలి. వైకాపా నేతలు హద్దుమీరి అరాచకాలు చేశారు. సైకోతో పోరాడాల్సి రావడం

తరువాయి 2లో..

## తిరుమలలో మరోసారి చిరుత, ఎలుగుబంట్ల కలకలం



తిరుమల: తిరుమలలో మరోసారి చిరుత, ఎలుగుబంట్లు సంచారం కలకలం రేపాయి. ట్రాప్ కెమెరాల్లో చిరుత, ఎలుగుబంట్ల కదలికలు నమోదయ్యాయి. గడచిన నెల రోజుల్లో రెండు రోజులు ట్రాప్ కెమెరాలో కదలికలు నమోదయ్యాయి. డిసెంబర్ 13, 29 తేదీల్లో ట్రాప్ కెమెరాకు చిరుత చిక్కింది. చిరుతతో పాటు ఎలుగుబంట్లు కదలికలు అధికారులు గుర్తించారు. ఎలిఫెంట్ ఆర్చ్ వద్ద చిరుత, ఎలుగుబంటి తిరుగుతున్నట్లు అధికారులు వెల్లడించారు. నడకమార్గంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలని, గుంపులు గుంపులుగా రావాలంటూ టీటీడీ హెచ్చరికలు జారీ చేసింది. నడకమార్గం పక్కనున్న అటవీ ప్రాంతంలో చిరుత సంచరించడంతో భక్తులు భయభ్రాంతులకు లోనవుతున్నారు. అవి తిరుగుతున్న దృశ్యాలు ట్రాప్ కెమెరాల్లో రికార్డ్ అయినట్లు పేర్కొన్నారు. టీటీడీ ఈవోకు ఫారెస్ట్ అధికారులు సమాచారం అందించారు.

## రూ.112.85 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** నగర ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు కృషి చేయడం జరుగుతుందని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. శనివారం ఆమె ఐదవ జోన్ 49వ వార్డు పరిధిలోని మురళి నగర్,అయ్యప్ప నగర్, పట్టాభి రెడ్డి గార్డెన్స్, ఏ ఎస్ ఆర్ నగర్, అజయ్ కలాం నగర్, మాణిక్యమాంబ కాలనీ, నెహ్రూ నగర్ తదితర ప్రాంతాలలో సుమారు రూ.112.85 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు, వార్డ్ కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లూ శంకర్రావు తో కలిసి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ నగర ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు కోట్లాది రూపాయలు వెచ్చించడం జరుగుతుందని అందులో భాగంగా 49 వ వార్డు పరిధిలోని సుమారు 1.13 కోట్ల రూపాయలు వెచ్చించి సుదర్శన్ పార్కు , ప్రశాంతి పార్కులలో కాంపౌండ్ వాల్ మరమ్మతులు, ఆకర్షణమైన బొమ్మలు, సేదదీరేందుకు బెంచీలు, పిల్లల ఆట వస్తువులు, అవుట్ డోర్ ఫిట్నెస్ ఎక్విప్మెంట్స్‌లు ఇతర ప్రాంతాలలో

సిసి రోడ్లు, సిసి కాలువలు, ఆర్ సి సి డ్రైన్ లు లాంటి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సారథ్యంలో విశాఖ నగరాన్ని ఎంతో అభివృద్ధి చేయడంతో పాటు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ఇంజనీరింగ్ అధికారులు, సచివాలయం సిబ్బంది, వైయస్సార్ సిపి నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.




## మున్సిపల్ ఇన్ చార్జ్ కమిషినర్ గా నాగరాజు



రాజాం (విజయభాను న్యూస్) : రాజాం మున్సిపల్ కార్యాలయ ఇన్ చార్జ్ కమిషినర్ గా ఎంవీ నాగరాజు శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేసిన కమిషినర్ డీటీవీ కృష్ణారావు ప్రస్తుతం సెలవుల్లో ఉన్నారు. ఆయన స్థానంలో ఇన్ చార్జ్ బాధ్యతలు తీసుకున్న నాగరాజు విధుల్లో చేరారు. ఈయనను కార్యాలయ ఉద్యోగులు శనివారం అభినందించారు.

## శ్రీ విజయ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం




రాజాం (విజయభాను న్యూస్) : రేగిడి ఆమదాలవలస మండలం ఉంగరాడ మెట్ట జూట్ ఫ్యాక్టరీ వద్ద పాలకొండ శ్రీ విజయ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంకు విశేష స్పందన లభించింది. శ్రీ విజయ హాస్పిటల్ ఎం,డి, దూబ పద్మావతి ఈసందర్భంగా మాట్లాడుతూ పాలకొండతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని తమ ఆస్పత్రి ద్వారా అందిస్తున్నామని వెల్లడించారు. ఇందులో బాగంగా సేవలు గ్రామాలకు విస్తరిస్తున్నామని, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన డాక్టర్ గేదెల శ్రీనుబాబు మాట్లాడుతూ ఇటువంటి ఆస్పత్రిలు పాలకొండ వంటి ప్రాంతాల్లో ఉండడం, గ్రామాల్లో వైద్య సేవలు ఉచితంగా అందించడం ఆనందంగా ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయికృష్ణ, డాక్టర్ సాయి శంకర్, డాక్టర్ వీణ సరస్వతి, డాక్టర్ విజయ, దూబ పద్మావతి తదితరులు పాల్గొన్నారు వైద్య శిబిరానికి వచ్చిన 550 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. పది మందిని ఆపరేషన్లకు ఎంపికచేశారు.



**విశాఖ దక్షిణ నియోజకవర్గం 35 వార్డు పరిధిలో ఉన్న పలు సమస్యలు అనగా 35 వ వార్డులో ఉన్న ఆయిల్ మిల్లు రోడ్డు గురించి మున్సిపల్ స్టేడియం అభివృద్ధి కోసం అలాగే ఇంద్ర ప్రియదర్శని మున్సిపల్ స్టేడియం దగ్గర నార్త్ గేటు దగ్గర ఉన్న రోడ్డు కోసం ప్రసాద్ గార్డెన్లో రోడ్డు కోసం సమస్యలను రోడ్డు నిర్మాణం చేయాలని ఆయిల్ మిల్ రోడ్డు సిసి రోడ్ వేయాలని నగర జీవీఎంసీ కమిషనర్ కలిసి వినతిపత్రం**

## కుప్పంలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించిన చంద్రబాబు

బాధాకరం. రాష్ట్ర ప్రజల కోసం సైకోతో పోరాడతా" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

సంస్కృతిని గుర్తు పెట్టుకొని భవిష్యత్ కోసం ముందుకెళ్లాలని తెదేపా అధినేత చంద్రబాబు సూచించారు. కురబ వర్గంతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. "ఐటీ రంగంలో కురబ వర్గానికి చెందిన వారు చాలా మంది స్థిరపడ్డారు. కురబలను ఆర్థికంగా పైకి తీసుకొచ్చే బాధ్యత మాది. గొర్రెల కాపరులు ప్రమాదవశాత్తు చనిపోతే రూ.10 లక్షలు బీమా ఇస్తాం. ఎప్పుడూ మన మూలాలను మరచిపోకూడదు. వైకాపా నాయకులు ఆలయ భూములను కూడా కబ్జా చేస్తున్నారు" అని విమర్శించారు.

## నేడు రారవే సమావేశం

రాజాం (విజయభాను న్యూస్) : రాజాం రచయితల వేదిక 107వ సమావేశం ఆదివారం ఉదయం 9 గంటలకు రాజాం పట్టణం విద్యానికేతన్ పాఠశాలలో జరుగుతుందని నిర్వాహకులు గార రంగనాథం శనివారం తెలిపారు. ప్రముఖ సాహితీవేత్త రాజాపు శాంతారావు అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందని, మున్నీటి గీతల్లో మత్స్యకార జీవనం అనే అంశంపై పొదిలాపు శ్రీనివాస్ ముఖ్యప్రసంగం చేస్తారని వివరించారు. అనంతరం సభ్యుల స్వీయరచన పఠనం ఉంటుందని వెల్లడించారు. ఈకార్యక్రమానికి రచయితలు, కవులు, తెలుగు భాషాభిమానులు, సాహిత్యాభిమానులు హాజరుకావాలని కోరారు.

## నవ సమాజ నిర్మాణంలో పాత్రికేయుల పాత్ర కీలకం
### విశాఖ నగర మేయర్ హరివెంకట కుమారి




భీమునిపట్నం : విజయభాను న్యూస్ : నవ సమాజ నిర్మాణంలో పాత్రికేయుల పాత్ర చాలా కీలకమని విశాఖ నగర మేయర్ హరివెంకట కుమారి అన్నారు. శనివారం శిల్పారామం(జాతర)లో స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నత విలువలతో కూడిన పాత్రికేయుల సేవలు సమాజహితానికి తోడ్పడతాయని అన్నారు.ప్రభుత్వానికి, ప్రజలకు అనుసంధానంగా వ్యవహరిస్తూ, సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టు వృత్తి ఎంతో గౌరవమైనదని అన్నారు.ఒక వైపు జర్నలిస్టులకు సంక్షేమం అందిస్తూనే మరో వైపు సమాజ సేవ కై కృషి చేస్తున్న ఎస్.సి.ఆర్.డబ్ల్యూ.ఏ సేవలు అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్ లో మంచి కార్యక్రమాలను నిర్వహించి సమాజ అభివృద్ధిలో అసోసియేషన్ సభ్యులు భాస్వామ్యులు కావాలని సూచించారు.అభివృద్ధిలో జర్నలిస్టు పాత్ర కీలకమైందని మేల్కొని ఆడారు. పిఎంపాలెం సీఐ రామకృష్ణ మాట్లాడుతూ సమాజానికి పాత్రికేయుల సేవలు ఎంతో అవసరమని,అలాగే సమాజ హితం కోసం జర్నలిస్టులు కీలకంగా వ్యవహరించాలన్నారు. విలేకరుల సంక్షేమం కోసం పనిచేస్తున్న స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సేవలను అభినందించారు. నగరంలో క్రైమ్ రేట్ తగ్గించేందుకు వీలుగా బిల్డింగ్ ప్లాన్ తో పాటు ప్రతి ఇంటికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా నిబంధన తీసుకురావాలని మేయర్ కి విజ్ఞప్తి చేశారు. సభకు అధ్యక్షత వహించిన స్మార్ట్ సిటీ రిపోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థకు అధ్యక్షులు బంగారు అశోక్ కుమార్ మాట్లాడుతూ నిర్దిష్టమైన లక్ష్యంతో ఎనిమిదేళ్ల క్రితం ప్రారంభించిన తమ సంస్థ ఎన్నో విజయాలు నమోదు చేస్తుందని తెలిపారు జర్నలిస్టుల సంక్షేమ సంక్షేమం సహా వృత్తి పరమైన కార్యక్రమాలు కూడా నిర్వహించినట్లు చెప్పారు. అసోసియేషన్ కోసం ప్రత్యేకంగా ఒక భవన నిర్మించే అంశం పరిశీలనలో ఉందన్నారు. ఈ ఏడాది విభిన్న కార్యక్రమాలతో జర్నలిస్టులకు భరోసాగా నిలుస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన అ.సోసియేషన్ గౌరవ సలహాదారు ఎన్. నాగేశ్వరరావు మాట్లాడుతూ వృత్తిపరమైన అంశాలపై జర్నలిస్టులకు త్వరలో ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని నిర్వహించినట్లు ఆయన తెలియజేశారు. ఏపీయూడబ్ల్యూజే నగర అధ్యక్షుడు ఆర్ రామచంద్రరావు మాట్లాడుతూ

ఎస్ సి.ఆర్ డబ్ల్యు.ఏ. చేపడుతున్న జర్నలిస్టుల సంక్షేమ కార్యక్రమాలకు భవిష్యత్తులో యూనియన్ తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు

ఈ సందర్భంగా స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులకు డైరీలు, మిఠాయిలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు

## జనవరి 22 కోసం ప్రపంచం ఎదురుచూస్తోంది

రద్దీ దృష్ట్యా జనవరి 22న భక్తులు అయోధ్యకు రావొద్దు. ఆ మరుసటి రోజు అంటే జనవరి 23 నుంచి జీవితాంతం శ్రీరాముడిని దర్శించుకోవచ్చు" అని మోదీ సూచించారు. భక్తులు ఇబ్బంది పడకూడదనే ఈ సూచన చేస్తున్నట్లు తెలిపారు.

ఈ ఉదయం అయోధ్య చేరుకున్న ప్రధాని మోదీ తొలుత 15 కిలోమీటర్ల మేర మెగా రోడ్ షోలో పాల్గొన్నారు. అనంతరం ఆధునిక హంగులతో అభివృద్ధి చేసిన అయోధ్య ధామ్ రైల్వే స్టేషన్‌ను ప్రారంభించారు. రెండు అమృత్ భారత్, ఆరు వందే భారత్ రైళ్లకు పచ్చ జెండా ఊపారు. అక్కడి నుంచి నేరుగా విమానాశ్రయానికి చేరుకున్న ప్రధాని.. మహర్షి వాల్మీకి ఎయిర్‌పోర్టును ప్రారంభించారు. దీంతో పాటు రూ.15,700కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.

**ఉజ్వల లబ్ధిదారు ఇంటి వద్ద ఆగి.. టీ తాగిన మోదీ**

ఉత్తరప్రదేశ్‌లోని ఆధ్యాత్మిక నగరం అయోధ్య లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ శనివారం పర్యటించారు. అయోధ్య రైల్వే స్టేషన్‌ను ప్రారంభించి అక్కడి నుంచి విమానాశ్రయానికి బయల్దేరిన ప్రధాని మోదీ.. మార్గమధ్యంలో తన కాన్వాయ్‌ను ఆపారు. ఓ సామాన్యురాలి ఇంటికి వెళ్లి వారిని ఆశ్చర్యపర్చారు.

అయోధ్యలోని ఓ చిన్న వీధిలో నివసిస్తున్న మీరా మాంఝీ అనే మహిళ ఇంటికి ప్రధాని వెళ్లారు. మోదీని చూడగానే వారంతా ఒక్కసారిగా ఆశ్చర్యపోయి సంతోషం వ్యక్తం చేశారు. ఆ మహిళ కుటుంబంతో కొంతసేపు ప్రధాని ముచ్చటించారు. వారి ఇంట్లో టీ తాగారు. ఈ సందర్భంగా ఓ బాలుడు తాను గీసిన పెయింటింగ్‌ను ప్రధానికి చూపించగా.. దానిపై ఆటోగ్రాఫ్ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఇంతకీ మీరా మాంఝీ ఎవరంటే.. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉజ్వల పథకం లబ్ధిదారుల్లో ఈమె 10 కోట్లవ మహిళ అని అధికారులు వెల్లడించారు. ఇక, అయోధ్య పర్యటనలో భాగంగా అధునాతనంగా పునరుద్ధరించిన అయోధ్య రైల్వేస్టేషన్ ను ప్రధాని ప్రారంభించారు. రెండు అమృత్ భారత్, ఆరు వందే భారత్ రైళ్లకు పచ్చజెండా ఊపారు. అంతకుముందు ఎయిర్‌పోర్టు నుంచి రైల్వే స్టేషన్ వరకు భారీ రోడ్‌షో నిర్వహించగా.. మోదీని స్వాగతించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు.

## జనవరి 1న నింగిలోకి పిఎస్ఎల్వి సి-58

ఎక్స్ పో శాటిలైట్ ఒక విభిన్నమైనది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఎక్స్ కిరణాల ధ్రువనాన్ని అధ్యయనం చేయడం కోసం దీన్ని రూపొందించింది. బెంగళూరులోని యు.ఆర్ రావు శాటిలైట్ సెంటర్లో తయారుచేసిన ఈ ఉపగ్రహాన్ని ఇప్పటికే శ్రీహరికోటకు తీసుకొచ్చి రాకెట్‌లో అనుసంధానం పనులు చేపట్టారు. భూమికి 650 కిలోమీటర్ల తక్కువ దూరంలో పిఎస్ఎల్వి -సి 58 రాకెట్ ఈ ఉపగ్రహాన్ని విడిచి పెట్టేలా ప్రణాళికలు రూపొందించారు. టెలిస్కోప్‌లాగా పని చేసే ఈ ఉపగ్రహ సేవలో మన దేశానికి ఎంతో ఉపయోగపడతాయని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. పిఎస్ఎల్వి -సి 58 రాకెట్ ప్రయోగం తర్వాత ఆ వెంటనే జి ఎస్ ఎల్ వి మార్కు- 2 ప్రయోగాన్ని కూడా ఇస్రో చేపట్టనుంది.

## రికార్డుస్థాయిలో ఉపాధి కల్పించిన లూలా ప్రభుత్వం

బ్రెసిలియా : రికార్డుస్థాయిలో ఆ దేశ ప్రజలకు మరోసారి లూలా ప్రభుత్వం ఉపాధి కల్పించింది. బ్రెజిల్‌లో ఈ ఏడాది చివరలో సెప్టెంబర్- నవంబర్ 2023 నెలల మధ్య కాలంలో 100.5 మిలియన్ల మందికి లూలా ప్రభుత్వం ఉపాధి కల్పించినట్లు బ్రెజిలియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జియోగ్రఫీ అండ్ స్టాటిస్టిక్స్ (ఐబిజిఇ) నివేదిక పేర్కొంది. 2022 సెప్టెంబర్ నవంబర్ కాలంతో పోల్చితే ఈ ఏడాది 515,000 మందికి ఉద్యోగాలు లభించాయని ఐబిజిఇ నివేదిక తెలపింది. గత నెల నవంబర్ నెలలో లూలా అవలంచిన ఆర్థిక విధానాల వల్ల 130,000 కొత్త ఉద్యోగాలు సృష్టించినట్లు స్థానిక మీడియా సెంట్రల్ డా పొలిటికా తెలిపింది. 2021లో న్యూ స్టాటిస్టికల్ మోడల్‌ను అమలులోకి తెచ్చినప్పటి నుండి 100 మిలియన్ల ప్రజలకు ఉపాధి కల్పించిన రికార్డును ఈ ఏడాది త్రైమాసికంలో రెండోసారి అధిగమించింది. ఈ రికార్డు కొనసాగింపుగానే నవంబర్ నెలలో మరికొన్ని ఉద్యోగాలను లూలా ప్రభుత్వం కల్పించినట్లు మీడియా వెల్లడించింది. ఈ ఏడాది అన్ని రంగాలు అభివృద్ధిని చవిచూశాయి. వ్యవసాయం, పశువులు, మత్స్య రంగాల్లో 4.3 శాతం వృద్ధి తగ్గింది. అయితే రవాణా, పోస్టల్ రంగాల్లో గతేడాది 2022 త్రైమాసికంతో పోల్చితే ఈ ఏడాది 4.3 శాతం వృద్ధి నమోదైంది. కాగా సెప్టెంబర్ నవంబర్‌ల నెలల మధ్య కాలంలో 8.2 మిలియన్ల మంది దేశంలో నిరుద్యోగులుగా ఉన్నారు. గతేడాది త్రైమాసికంలో 8.1 శాతం ఉన్న నిరుద్యోగం ఈ ఏడాది త్రైమాసికంలో 0.6 శాతం పాయింట్లు తగ్గింది. ఈ ఏడాది ఒక్క నవంబర్‌లోనే 39.4 మిలియన్ల బ్రెజిలియన్లు ఉపాధి పొందారు. ఇక అనధికారికంగా ఉపాధి పొందిన వారు 39.2 శాతంగా ఉంది. 2012 నుంచి బ్రెజిల్‌లో నిరుద్యోగం ఎక్కువగా ఉంది. అందుకే నెలవారీ నిరుద్యోగరేటును పరిగణనలోకి తీసుకునేవారు. అయితే ప్రస్తుతం త్రైమాసానికొకసారి నిరుద్యోగ రేటును ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుంది.

## స్వాతంత్ర్య స్ఫూర్తి మణిహారం రాఘవదాసు

### గాంధీ మందిరంలో త్రిపురాస విగ్రహ ఆవిష్కరణ
### తండ్రిని స్మరించుకోవడం ఆనందంగా ఉంది: డాక్టర్ వెంకటరత్నం



శ్రీకాకుళం, డిసెంబర్ 30: స్వాతంత్ర్య ఉద్యమంలో జిల్లాకు చెందిన త్రిపురాస రాఘవదాసు ఎందరో జిల్లావాసులకు స్ఫూర్తిగా నిలిచారని వక్తలు పేర్కొన్నారు. స్వాతంత్ర సమరయోధుల ప్రతినిధిగా నిస్వార్థమైన జీవితాన్ని ఆయన గడిపారన్నారు. శ్రీకాకుళం నగరం శాంతిసగర్ కాలనీలో ఉన్న గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు త్రిపురాస రాఘవదాసు నూతన విగ్రహాన్ని మాజీ మంత్రి డాక్టర్ త్రిపురాన వెంకటరత్నం శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్రోద్యమ కాలంలో గాంధీజీ పిలుపును అందిపుచ్చుకొని జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలను రాఘవదాసు నిర్వహించారన్నారు. జిల్లాకు చెందిన గౌతు లచ్చన్న, జస్టిస్ పున్నయ్య, చౌదరి సత్యనారాయణతో పాటు పలువురిని సమన్వయం చేసుకుంటూ త్రిపురాస రాఘవదాను ప్రజల్లో స్వాతంత్రోద్యమ కాంక్షను పెంపొందించారన్నారు. స్వాతంత్ర సమరయోధుల స్మృతి వనంలో తన తండ్రి రాఘవదాసు విగ్రహాన్ని ప్రతిష్ఠించడం ఎంతో ఆనందంగా ఉందని వెంకటరత్నం అన్నారు. గాంధీ మందిర బృందం ప్రతినిధులు ఎం.ప్రసాదరావు, సురంగి మోహన్రావు, కొంక్యాన వేణుగోపాల్, పోలు మహంతి జగన్మోహన్ రావు మాట్లాడుతూ స్వాతంత్ర్య స్ఫూర్తిని నిరంతరం జ్వలింపచేసిన వ్యక్తి రాఘవదాసు అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం శాసనమండలి సభ్యునితో పాటు మరెన్నో వదవులను రాఘవదాను నిర్వహించిన క్రమంలో నిస్వార్థంగా సేవలందించారన్నారు. జిల్లా పౌరసంబంధాల అధికారి బాల మాన్ సింగ్ మాట్లాడుతూ త్రిపురాస రాఘవదాను పేరిట కుటుంబం ప్రజాసేవలో నిరంతరం శ్రమిస్తూ ఎందరికో స్ఫూర్తిగా నిలిచారన్నారు. టిడిపి పూర్వ జిల్లా అధ్యక్షుడు చౌదరి బాఫీ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తిని నింపే విధంగా రాఘవదాను పనిచేశారన్నారు. సీనియర్ న్యాయవాది తంగి చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లా చరిత్రలో త్రిపురాస రాఘవదాను ప్రత్యేక స్థానాన్ని లిఖించుకున్నారన్నారు. తొలుత అందరూ గాంధీజీతో పాటు త్రిపురాస రాఘవదాసు విగ్రహాలకు పూలమాలలు వేశారు. కమిటీ బృందం బరాటం లక్ష్మణరావు, జామి భీమశంకర్, నటుకుల మోహన్, కొంక్యాస మురళీధర్, కోట సావిత్రమ్మ, బాదాస దేవభూషణ్, పొన్నాడ రవికుమార్, మహిబుల్లాఖాన్, గుత్తు చిన్నారావు, కె.వి.జె. రాధాప్రసాద్, సక్క శంకరరావు, కొమ్ము రమణమూర్తి, కె.వి.పద్మావతి, కూన సత్యం తదితరులు పాల్గొన్నారు.

## రైతులను దగాచేసిన వైసీపీ ప్రభుత్వం : మాజీ మంత్రి కోండ్రు

### - ధాన్యం కొనుగోలులో భారీ కుంభకోణం - చిన్న శ్రీను ఆధ్వర్యంలో దళారులు పెచ్చుమీరుతున్నారు



రాజాం : మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఇన్చార్జి కోండ్రు మురళీమోహన్ ఆధ్వర్యంలో రాజాం తెలుగుదేశం పార్టీ కార్యాలయం ముందు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో భారీ కుంభకోణం జరుగుతుందని ఆరోపిస్తూ రైతులతో కలిసి రోడ్డు మధ్యలో నిరసన కార్యక్రమం చేపట్టారు,80 కేజీల వరి బస్తా 400 గ్రాముల గోనె సంచి తీసుకోవాలి,కానీ దళారుల మాఫియా ఏర్పడి 86-87 కేజీల బస్తా తీసుకుంటుందన్నారు,అంటే క్వింటాకు 5 నుండి 8 కేజీల వరకు మార్జి న్ తీసుకొని రైతుల పొట్టకొడుతున్నారన్నారు,ట్రక్ షీట్ ల వ్యవస్థను మ్యానేజ్ చెయ్యడంతో రైతులకు అన్యాయం జరుగుతుందన్నారు,విజయనగరం జిల్లాలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీను ఆధ్వర్యంలో దళారులు పెచ్చు మీరిపోతున్నారని కోండ్రు ఆగ్రహం వ్యక్తం చేశారు,దళారులు తేమశాతం ఇష్టానుసారం నిర్ణయించి రైతులను నిలువునా దోచేస్తున్నారు,ట్రాన్స్ పోర్ట్ చార్జీలకు రైతులు స్వంత సొమ్మును వెచ్చించాల్సి వస్తుందన్నారు,ప్రభుత్వం క్వింటా ధర 2183 రూపాయలు కేటాయించింది, కానీ రైతుకు మాత్రం 1500 ఇస్తున్నారు,రైతులు పండించిన పంట కొనుగోలులో అవకతవకలు చేస్తున్నారు.రాష్ట్రంలో అన్నదాతల ఆత్మ బలిదానాలకు సీఎం అసమర్థతే కారణం అని కోండ్రు దుయ్యబట్టారు,ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిహారం అందక పోగా, దెబ్బతిన్న పంటను పొలం నుంచి తీసేందుకే పెట్టుబడికి మించి ఖర్చవుతోందన్నారు,ఈ-క్రాప్లో పంట నమోదు చేయకపోవడంతో ధాన్యం విక్రయించేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు,ఖరీఫ్ ధాన్యం సేకరణలో తేమ శాతం కొలిచే యంత్రాలు సరిగా పని చేయక ఆర్బీకేల్లో ఒక విధంగా రైస్ మిల్లర్ల వద్ద మరో రకంగా రావడంతో ధాన్యం బస్తాకు కనీస మద్దతు ధర కన్నా ధర తగ్గించడంతో సాగుదారులు నష్టపోయారు,రాష్ట్రంలో ఇటీవల ధాన్యం కొనుగోళ్లలో భారీ కుంభకోణం చోటుచేసుకుంటోంది,ఇప్పుడు అర్బీకేలు అంటూ అనేక వ్యవస్థలు తెచ్చారు,తేదేపా హయాంలో 7రోజుల్లో ధాన్యం డబ్బుచెల్లించాం, అని గుర్తుచేశారు,ఇప్పుడు ఏడాది అయినా ఇవ్వడం లేదు దేశంలో ఎక్కువ అప్పులు ఉన్న రైతులు మన రాష్ట్ర రైతాంగమే అని అన్నారు,ఆత్మ హత్యలు కూడా మన రాష్ట్రంలోనే ఎక్కువ కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చే 8 స్కీములను జగన్ రద్దు చేశారు,నాడు యాంత్రీకరణ, డ్రిప్ ఇరిగేషన్ కు సబ్సిడీ అందించిన ఘనత చంద్రబాబుది,నాలుగున్నరేళ్లుగా రాష్ట్రంలో రైతాంగం అనేక సమస్యల్లో కూరుకుపోయింది,ప్రభుత్వ చర్యలు రైతులకు న్యాయం చేసే విధంగా ఉండాలి.

కానీ జగన్ ప్రభుత్వం మాత్రం ధనదాహం తో స్వలాభం కోసం, ఆయా వర్గాలపై పెత్తనం కోసం ప్రయత్నిస్తున్నారన్నారు.

ఈ కార్యక్రమంలో రాజాం టౌన్ అధ్యక్షులు నంది సూర్యప్రకాశరావు, సుమల వెంకట మన్మధరావు, పిన్నింటి మోహన్ రావు,టంకాల కన్నం నాయుడు,గురవాన నారాయణరావు, పొన్నాడ భీమేశ్వరరావు, దూబ ధర్మరావు, గేదెల బాలమురళి, బనిశెట్టి వెంకట రావు, మంతిన ఉషారాణి, ముగడ శ్రీనివాసరావు, మరిపి జగన్ మోహన్ రావు,ఉరిటి సురేంద్ర, నీలయ్య మాస్టారు,పొట్నూరు సోమశేఖర్, రఘు మండల గణపతి,ఆర్ వెంకట్రావు, జయరాం, బాణన విష్ణు, జిటి నాయుడు, పెంకి గౌరీశ్వరరావు, రాము, కె రవీంద్ర, కె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పరీక్ష కేంద్రాల పరిశీలన



ఆంధ్రవిశ్వవిద్యాలయం **(విజయభాను న్యూస్)** : ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల పరిధిలో జరుగుతున్న మూడవ సెమిస్టర్ పరీక్షలను ఏయూ ఇంచార్జి వీసీ ఆచార్య కె.సమత ఈరోజు ఉదయం పరిశీలించారు. పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి, పరీక్షలు జరుగుతున్న విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించడం పట్ల అధికారులను అభినందించారు. కార్యక్రమంలో ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ సాల్మన్ బెన్నీ, డాక్టర్ రాజమాణిక్యం తదితరులు ఉన్నారు.

# కనకమహాలక్ష్మీ అమ్మవారికి సారె సమర్పణ



అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : విశాఖ ఉమ్మడి జిల్లా ఆరాధ్య దైవం శ్రీ శ్రీ శ్రీ కనకమహాలక్ష్మీ అమ్మవారిని పద్మశాలీలు ఇంటి ఆడపడుచుగా పసుపు కుంకం సారె , చీర జాకెట్లతో రాష్ట్ర ఆప్కో చైర్మన్ గెంజి చిరంజీవి దంపతులు ఉత్తరాంధ్ర సమస్త చేనేతలు కలిసి అమ్మవారికి శనివారం సారె సమర్పించుకొన్నారు . ఈ కార్యక్రమములో రాష్ట్ర ఆప్కో చైర్మన్ , మంగళగిరి నియోజకవర్గం ఇన్చార్జ్ గెంజి చిరంజీవి దంపతులు , అనకాపల్లి జిల్లా చేనేతలు అల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ ఇంచార్జ్ మాడెం సూరి అప్పారావు , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పప్పు రాజారావు చేనేత నాయకులు , మహిళలు , అనకాపల్లి జిల్లా చేనేతలు తదితరులు పాల్గొన్నారు .

# ఉపాధ్యాయులకు డైట్ లో రెండు రోజుల శిక్షణ



భీమునిపట్నం : విజయభాను న్యూస్ : చిన్నారులకు నేర్పే విద్యాబుద్ధులు వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని డైట్ ప్రిన్సిపాల్ ఎల్ సుధాకర్ అన్నారు జీవీఎంసీ బాల్యం పాఠశాలల ఉపాధ్యాయులకు డైట్ లో జరిగిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ముగింపు సభలో ఆయన పాల్గొని మాట్లాడారు అంగన్వాడీల వలె పూర్వ ప్రాథమిక తరగతులను జీ విఎంసీ పరిధిలో బాల్యం పాఠశాలల పేరున బోధిస్తున్న ఉపాధ్యాయులందరూ పసిపిల్లల మనస్తత్వాన్ని తెలుసుకుంటూ వారి శారీరక మానసిక భావోద్వేగా ఎదుగుదలకు తగిన విధంగా బోధన చేస్తూ పిల్లలను ఆకర్షించాలని రెండు రోజుల్లో నేర్చుకున్న అంశాలు ఆటపాటలతో విద్యార్థులకు నేర్పించాలని అన్నారు.ట్రైనింగ్ కోఆర్డినేటర్ సీనియర్ అద్యాపకులు గొట్టేటి రవి మాట్లాడుతూ 30 సంవత్సరాల నుంచి బాల్యంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు శాస్త్రీయ శిక్షణ నేడు పొంది ఉన్నారని, రాబోయే రోజుల్లో ఆరు రోజుల ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించే ప్రణాళిక రూపొందిస్తున్నామని జిల్లా విద్యాశాఖ అధికారిని ఈ విషయంలో పూర్తి సహకారం అందించారని అన్నారు. గురువారం, శుక్రవారం రెండు రోజులపాటు డైట్లో జరిగిన శిక్షణను అధ్యాపకులు సోమయాజులు, హరిణి, మహాలక్ష్మి లతోపాటు వ్రతం స్వచ్ఛంద సంస్థకు చెందిన లలిత హర్షిని లు రిసోర్స్ పర్సన్ లుగా వ్యవహరించి కృత్యాధార పద్ధతులలో బోధన చేశారు మొదటిరోజు జిల్లా విద్యాశాఖ అధికారిని ఎల్. చంద్రకళ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ విద్యార్థుల శ్రేయస్సు భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని పసివయసులోనే వారిని మంచి మార్గంలో నేర్పడానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖ అధికారి ఏ గౌరీ శంకర్రావు సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

# మిద్దె తోటల పెంపకానికి జివిఎంసి ప్రోత్సాహం

## – జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ



విశాఖపట్నం **(విజయభాను న్యూస్)** : విశాఖ నగరంలో పచ్చదనంను పెంపొందించేందుకు జివిఎంసి అన్ని జోన్ల పరిధిలో మిద్దె తోటల పెంపకంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ తెలిపారు. ఎకో వైజాగ్, ఎకో-గ్రీన్ కార్యక్రమాలలో భాగంగా గాజువాక పరిధిలో సుందరయ్య కాలనీలో 100 మందికి పైగా గృహస్తులను ఎంపిక చేసి మిద్దె తోటల పెంపకంపై శనివారం యుసిడి అధికారులతో అవగాహన కార్యక్రమం చేపట్టడమైనదని ఆయన తెలిపారు. ప్రతి భవనాలపై, అపార్ట్ మెంట్లపై గేటేడ్ కమ్యూనిటీల వద్ద మిద్దె తోటల పెంపకం వలన కావలసిన కూరగాయలు, పండ్లు, ఔషధ మొక్కలను మనము ఇళ్ళలో పెంచుకోవడం ద్వారా ఆరోగ్య పరిరక్షణకు దోహద పడడమే కాకుండా ఆర్థిక లాభం చేకుర్చుకోవచ్చని కమీషనర్ తెలిపారు. దీనితో పాటు మిద్దె తోటల వలన కొండ కాలుష్య నివారణ, గాలి శుభ్రపరచుట, వాతావరణ మార్పులను అరికట్టుటకు ఉపయోగపడు తుందన్నారు. ఈ మిద్దె తోటల అవగాహన కార్యక్రమములు యుసిడి సెక్షన్ మరియు సస్టైనబిలిటి అండ్ రిలయన్స్ యూనిట్ (ఎస్.ఆర్.యు), జివిఎంసి లు సిటీ టెర్రస్ గార్డెన్స్ (సిటిజి) గ్రూప్ తో కలసి నిర్వహించడం జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిటిజి సభ్యులు శ్రీమతి ఐశ్వర్య మరియు గ్రూప్ సభ్యులు కాలనీ వాసులకు విత్తనాలను పంచి, మిద్దె తోటలను ఏ విధంగా అభివృద్ధి చేయాలో డెమోన్ స్ట్రేట్ ద్వారా నివాసితులకు వివరించారని కమీషనర్ తెలిపారు.

# దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవములో అన్నసంతర్పణ



విశాఖ రూరల్ : మధురవాడ (విజయభాను న్యూస్) : మహా విశాఖ 6వ వార్డు పరిధి చంద్రంపాలెం జాతర గట్టుపై వెలిసిన శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవములు రెండవ రోజు ఘనంగా నిర్వహించారు, వేకువజాము నుండే అమ్మవారి మూల విరాట్ కు పంచామృత సుగంధ ద్రవ్య జాలాభిషేకములు జరిపించి అనంతరం ప్రత్యేక కుంకుమార్చనలు, పుష్పర్చన పూజలు నిర్వహించి భక్తులకు తీర్ధ ప్రసాదాలు అందించారు. అనంతరం చంద్రంపాలెంకు చెందిన జగుపిల్లి అప్పారావు దంపతులు, కమిటీ సభ్యులు, ఆర్ధిక సహాయంతో ఆలయ ప్రాంగణంలో సుమారు 5 ,000 మందికి భారీ అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేసారు. అలాగే సాయంత్రం అమ్మవారి ఆలయంలో సహస్ర దీపారాధన నిర్వహించారు, ఈ సందర్భంగా చంద్రంపాలెం లక్ష్మి నరసింహ కోలాట బృందం ప్రదర్శించిన కోలాటం అలరించింది, కార్యకమములో ధర్మకర్త పిల్లా చంద్రశేఖర్, కమిటీ ప్రతినిధులు పిల్లా సూరిబాబు, పి.వి.జి.అప్పారావు, నాగోతి తాతారావు, పిల్లా శ్రీనివాసరావు, దుక్క వరం, పిల్లా మోహన్ శివకృష్ణ, పిల్లా వెంకటరమణ, పోతిన పైడిరాజు, పోతిన శివ, గూడేల రాజు, పిల్లా సన్యాసిరావు, దుర్గాశి సోంబాబు, పొట్నూరి హరికృష్ణ, పీస రమణ, యస్.ఆర్.బాబు, కేశనకుర్తి అప్పారావు, పిల్లా రమణ, పిల్లా రాజు, మరుపిల్లి ఆనంద్, బంక వాసు, బైపిల్లి సురేష్, పిల్లా శ్రీను చంద్రంపాలెం గ్రామ పెద్దలు పిల్లా మధు పాత్రుడు, పిళ్ళా శ్రీనివాసరావు, పీస రామారావు, బి. సత్యన్నారాయణ, జగుపిల్లి నాని, బోగవిల్లి నాని, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, మాజీ కార్పొరేటర్ జగుపిల్లి అప్పలరాజు తదితరులు పాల్గున్నారు.

# సంస్కృతి గ్లోబల్ స్కూల్లో వేడుకగా ఫ్యూజన్ ఉత్సవం




పరవాడ:అనకాపల్లిజిల్లా పరవాడ మండలం పి బోనంగి పరిధి సంస్కృతి గ్లోబల్ స్కూల్లో విద్యార్థుల్లో వికసిస్తున్న వెలుగురేఖలైన నాట్యం,గీతం, సంగీతం,చిత్రలేఖనం,కృత్రిమ మేధ వంటి అంశాల సమ్మేళనంతో కూడిన ఫ్యూజన్ అను ఉత్సవాన్ని శనివారం విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి ఉత్సహంగా జరుపుకొన్నారు. ఇందులో భాగంగా చిన్నారులు కౌబోయ్, కాశ్మీరి, రాజస్థాని,తిల్లానా వంటి నృత్యాలు, రైతుల స్థితి గతులు గురించి ప్రదర్శించిన నృత్యాలతో పాటు మన సంస్కృతిలో భాగమైన చిత్రలేఖనం అహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.అలాగే కృత్రిమ మేధ, హెల్త్ ఎడ్యుకేషన్ ప్రాజెక్ట్ లు కూడా విద్యార్థుల తల్లిదండ్రుల మెప్పుపోందాయి. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ పి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ చిన్నారులలో భావొద్వేగాలు కరువ వుతున్నాయని,మానసిక ఉల్లాసం కోసం ప్రతి తల్లిదండ్రులు పౌష్టికఆహారం,క్రీడలు,చదువు వంటివి వరస క్రమం పాటించాలి అని కోరారు. ఒకప్పుడు కళలు కడుపు నింపుతాయా అన్న నిట్టూర్పు నుండి ఆర్థిక వ్యవస్థకు ఆరోప్రాణంగా మారిన సంగీతం, చిత్రలేఖనం, నాట్యం, కృత్రిమమేధ వైపుకు విద్యార్థులకు చూడడం ఆనందమని అందుకు విద్యార్థుల తల్లిదండ్రులు కృషి అభినందనియమని అన్నారు. ఈ కార్యక్రమంను చక్కగా నిర్వహించడంలో ప్రముఖపాత్ర పోషించిన పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి, సీఈఓ కె.నిశాంత్, కోఆర్డినేటర్ రామలక్ష్మి,డాన్స్,ఆర్ట్ మాస్టర్ జ్యోతిర్మయి,ఎమ్.శంకర్ మరియు వారికి సహకరించిన ఉపాధ్యాయులకు,విద్యార్థుల తల్లిదండ్రులకు,పాఠశాల డైరెక్టర్ పి.ఉదయనాగశ్రీ అభినందనలు తెలిపారు.

# ఘనంగా ప్రారంభమైన మాలతాంబ స్పోర్ట్స్ మీట్



విశాఖ రూరల్ : మధురవాడ (విజయభాను న్యూస్) : మహా విశాఖ 6 వ వార్డు పరిధి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం సమీపంలోగల మాలతాంబ విద్యానికేతన్ పాఠశాల ఆధ్వర్యంలో సాంకేతిక కళాశాల మైదానంలో ఘనంగా స్పోర్ట్స్ మీట్ ప్రారంభమయ్యాయి. రొండు రోజుల పాటు నిర్వహించే యాన్యువల్ స్పోర్ట్స్ మీట్ లో సుమారు 300మంది విద్యార్థులు వివిధ క్రీడల్లో పాల్గొన్నారు. రన్నింగ్,క్రికెట్,త్రోబాల్,షాట్ పుట్,కోకో, రిలేరేస్,పిరమిడ్స్, యోగ ఆసనాలు,మార్షల్ ఆర్ట్స్,యుద్ధ కళలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమానికి రిటైర్డ్ అడిషనల్ ఎస్.పి టి.ఎస్.ఆర్.ప్రసాద్, సీఈఓ ఎన్.ఐ.ఎఫ్.ఎస్. జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు సునీల్ మహంతి. డిప్యూటీ డిఇఓ ఎ.గౌరీశంకర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సాంకేతిక విద్యాసంస్థలు మధుబట్ ముఖ్య అతిథులుగా పాల్గొని స్పోర్ట్స్ మీట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ క్రీడల వలన విద్యార్థులకు శారీరక దృఢత్వంతో పాటు మానసిక పరివర్తన వస్తుందని, రాష్ట్రస్థాయి జాతీయస్థాయి గుర్తింపుతో పాటు మంచి భవిష్యత్తు చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పాఠశాల చైర్మన్,విశాఖ డిస్ట్రిక్ట్ బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు సునీల్ మహంతి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఆటల పట్ల ఆసక్తిని పెంపొందించుకొని, నైపుణ్యంతో క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు, మానసిక ఉల్లాసం వృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ బాలకృష్ణ, వి.హనుమంతరావు, పాఠశాల ప్రిన్సిపల్ ఏ.ఆదిమూర్తి, వైస్-ప్రిన్సిపాల్ బి శ్రీదేవి, ఫిజికల్ డైరెక్టర్ బి హరీష్, కరాటే కోచ్ సరస్వతి, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అపూర్వ సమ్మేళనం... ఆత్మీయతల పరిమళం

## – ఘనంగా వి.టి హై స్కూల్ మెగా ప్లాటినం జూబ్లీ వేడుకలు



విశాఖపట్నం: తాము చదువుకున్న పాఠశాలకు పూర్వ విద్యార్థుల చేరుకున్నారు. తమ చిన్ననాటి రోజులను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులకు పాదాభివందనాలు చేసారు. చిన్న పిల్లలుగా మారిపోయి తమ బాల్యాన్ని గుర్తు చేసుకుంటూ, స్నేహితులతో సందడి చేశారు. సీతంపేట లోని వి. టి హై స్కూల్ దీనికి వేదికయ్యింది. పాఠశాల 77వ వార్షికోత్సవాన్ని శనివారం సాయంత్రం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ పి.ఎన్ రావు ని పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించి ఆశీస్సులు అందుకున్నారు.

ప్రత్యేక అతిథి ది హిందు పత్రిక బ్యూరో చీఫ్ సుమిత్ భట్ట మాట్లాడుతూ ప్రతి వ్యక్తి అభివృద్ధికి తల్లి, గురువు ఎంతో ప్రధానమని విద్యాబుద్దులు నేర్పి మంచి జీవితానికి బాటలు వేసిన పాఠశాలను అధ్యాపకులను మరువరాదని చెప్పారు. ప్రత్యేక అతిథి ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ టి. భవాని ప్రసాద్ మాట్లాడుతూ వి. టి స్కూల్ ప్రస్థానాన్ని సమాజ సేవగా తాను భావిస్తానని చెప్పారు. ఐదు దశాబ్దాల క్రితం ఇదే పాఠశాలలో తాను విద్యార్థిగా చదువుకోవడాన్ని గర్వకారణంగా భావిస్తున్నానని అన్నారు. పటిష్టమైన అత్యున్నత ప్రమాణాలతో కూడిన పాఠశాల విద్యను అందిస్తున్న వి.టి స్కూల్ యాజమాన్యాన్ని మనస్పూర్తిగా అభినందిస్తున్నట్లు చెప్పారు. పాఠశాల ప్రిన్సిపాల్ పి.ఎన్ రావు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు పాఠశాల పట్ల చూపుతున్న ప్రేమాభిమానాలు తమకు కొత్త శక్తిని అందిస్తున్నాయని చెప్పారు. పాఠశాల అభ్యున్నతికి కృషిచేసిన అధ్యాపకులు, విద్యార్థులు వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. పాఠశాల కరస్పాండెంట్ రమణ రావు మాట్లాడుతూ దశాబ్దాలుగా విద్యారంగంలో పోటీ తత్వం పెరిగి ఎన్నో పాఠశాలలు వచ్చినప్పటికీ అత్యున్నత ప్రమాణాలతో, విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తూ వి. టి హై స్కూల్ తన ప్రస్థానాన్ని విజయవంతంగా కొనసాగిస్తోందని చెప్పారు. పాఠశాల హెడ్ మిస్ట్రెస్ పి. లక్ష్మి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఆంగ్లభాష నైపుణ్యాలకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తూ నిపుణులైన, అంకిత భావం కలిగిన అధ్యాపక బృందంతో లక్షలాదిమంది విద్యార్థులకు ఉన్నత భవిష్యత్ నీ వి.టి హైస్కూల్ అందించిందని చెప్పారు. అనంతరం పాఠశాలలో చదువుకుని అత్యున్నత స్థానంలో స్థిరపడిన పూర్వ విద్యార్థులను ఈ సందర్భంగా పాఠశాల తరఫున సత్కరించారు. అనంతరం పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి.

# మున్సిపల్ కార్మికుల సమస్యలు తీర్చాలి - గరే గురునాధ్



విశాఖ రూరల్ : మధురవాడ (విజయభాను న్యూస్) : రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె శనివారం ఐదవ రోజుకు చేరుకుంది. మహా విశాఖ 6 వ వార్డు పరిధిలో కారుషెడ్ జంక్షన్ వద్ద నిర్వహిస్తున్న కార్మికుల సమ్మెకు టీడీపీ జనసేన పార్టీ నాయకులూ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు యువత ఉపాధ్యక్షులు గరే గురునాథ్ మాట్లాడుతూ అధినేత చంద్రబాబు పిలుపుమేరకు మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె కు మద్దతుగా పాల్గున్నామని వారికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేసారు, అలాగే డ్రైనేజీలు బాగు చేసే మున్సిపల్ కార్మికులకు, రోడ్లను శుభ్రపరిచే కార్మికులకు కనీస వేతనం కూడా ప్రభుత్వం చెల్లించలేదా అని ఆవేదన వ్యక్తం చేసారు. మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికుందర్నీ పర్మినెంట్ చేయాలనీ, జిఓ ఆర్టి నెం. 96 ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనీ రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యూటీ, పెన్షన్ ఇవ్వాలనీ డిమాండ్ చేశారు. 6 వ వార్డు జనసేన అధ్యక్షుడు సంతోష్ నాయుడు మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య కాంట్రాక్టు కార్మికుల డిమాండ్లను పరిష్కారం చేయడంలో ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని పేర్కొన్నారు. వార్డు టీడీపీ బీసీ సెల్ అధ్యక్షులు రెడ్డి సత్యన్నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణం నెరవేర్చాలనీ, కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని, సిఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నెరవేర్చి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో మధురవాడ సీఐటీయూ జోన్ కమిటీ సభ్యులు, పారిశుధ్య కార్మికులు, టీడీపీ జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు

# విజయభాను సంపాదకీయం

## చెక్కుచెదరని మైత్రి

అంతర్జాతీయంగా ఒక అస్పష్ట వాతావరణం అలుముకున్న వేళ భారత్ రష్యాలు తమ చిరకాల స్నేహబంధాన్ని మరింత పటిష్టపరుచుకుంటామని ప్రతినబూనాయి. ఏటా జరిగే శిఖరాగ్ర సమావేశం కోసం ఆ దేశంలో పర్యటించిన విదేశాంగ మంత్రి జైశంకర్ రష్యా తమ నమ్మదగిన మిత్ర దేశమని మరోసారి చాటారు. దాదాపు ఆరున్నర దశాబ్దాల ద్వైపాక్షిక సంబంధాల్లో సమస్యలు తలెత్తలేదని అనలేం. మన దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రారంభమై అమెరికా వైపు మొగ్గుచూపటం మొదలైనప్పటినుంచీ రష్యా కలవరపడుతోంది. అమెరికా ఇండో పసిఫిక్ వ్యూహంలో భాగంగా ఏర్పడిన చతుర్భుజ కూటమి(క్వాడ్)లో మన భాగస్వామ్యం రష్యాకు ససేమిరా నచ్చలేదు. దాన్ని 'ఆసియా పసిఫిక్ వ్యూహం'గా సవరించి తనతో సహా ఆసియా దేశాలన్నిటికీ అందులో భాగస్వామ్యం కల్పించాలన్నది రష్యా డిమాండ్. అదే సమయంలో చైనాకు రష్యా సన్నిహితం కావటం, పాకిస్తాన్‌తో సైతం మైత్రి నెరపటం మన దేశాన్ని ఇబ్బందిపెట్టే అంశాలు. ఇక ఇటీవలిఅంతర్జాతీయ పరిణామాల్లో ఇరు దేశాలూ ఉత్తర దక్షిణ ధ్రువాలుగా వున్నాయి.

దౌత్య సంబంధాలుఎంతో సున్నితమైనవి. ఒక దేశంతో మనకు ఏర్పడే చెలిమి అంతవరకూ మనతో మిత్రత్వం నెరపుతున్న మరో దేశానికి సమస్యగా అనిపించవచ్చు. అనుమానాలు తలెత్తవచ్చు. ఆ రెండు దేశాలమధ్యా వుండే పొరపొచ్చాలే అందుకు కారణం. 2016 నాటి అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యం చేసుకుందన్న ఆరోపణలు వచ్చినప్పటినుంచీ రష్యా అమెరికా సంబంధాల్లో సమస్యలు తలెత్తాయి. ఆ తర్వాతకాలంలో క్రిమియాను రష్యా దురాక్రమించాక అమెరికా మరింత ఆగ్రహించింది. ఆ దేశంతో ఎవరూ సన్నిహితంగా వుండరాదని కోరుకుంది.

ఇక ఉక్రెయిన్ యుద్ధం మొదలైనప్పటినుంచీ రష్యాపై అనేక ఆంక్షలు విధించి, పాశ్చాత్య దేశాలను కూడగట్టింది. మన దేశంపై కూడా ఒత్తిళ్లు తెస్తూనేవుంది. అయినా ద్వైపాక్షిక వాణిజ్యం 1,200 కోట్ల డాలర్ల నుంచి నిరుడు 5,000 కోట్ల డాలర్లకు చేరుకుంది. అమెరికా ఆంక్షల కారణంగా యూరొప్ దేశాలకు ముడి చమురు అమ్మకం ఆగిపోయిన పర్యవసానంగా మన దేశానికి రష్యా చవగ్గా చమురు విక్రయించటంతో ఈ వాణిజ్యం నాలుగు రెట్లు పెరిగింది. ముమ్ముందు ఇది మరింత పెరుగుతుందని జైశంకర్ చెబు తున్నారు.

ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ యుద్ధాన్ని మన దేశం వ్యతిరేకించినా బాహాటంగా రష్యాను విమర్శించలేదు. మన జాతీయ భద్రతా వ్యూహంలో రష్యా పాత్ర అత్యంత కీలకం. మొదటినుంచీ మన రక్షణ కొనుగోళ్లలో రష్యా వాటా అధికం. ఇప్పటికీ ఆయుధాల మరమ్మత్తు బాధ్యత రష్యాదే. ఇటీవలి కాలంలో అమెరికా, ఫ్రాన్స్‌ల నుంచి కొనుగోళ్ల పెరిగాయి. తన సలహాను బేఖాతరు చేసి రష్యానుంచి అత్యాధునిక ఎస్ 400 క్షిపణి వ్యవస్థను కొనుగోలు చేయటం అమె రికాకు నచ్చలేదు. ఇలా ఎన్ని ఒత్తిళ్లున్నా రెండు దేశాల బంధం సడలలేదు.

జైశంకర్ తాజా పర్యటనలో తమిళనాడులోని కూదంకుళం అణు విద్యుత్ ప్రాజెక్టుకు రష్యా మరింత సాంకేతిక సహకారం అందించే ఒప్పందంపై సంతకాలయ్యాయి. 2016లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టులో రెండు యూనిట్లు ఇప్పటికే పనిచేస్తుండగా మరో నాలుగు మొదలుకావాల్సివుంది. 2027 నాటికి ఈ ప్రాజెక్టు వెయ్యి మెగావాట్ల విద్యుదుత్పత్తి ప్రారంభించాల్సి వుంది. ఇదిగాక ఔషధాలు, వైద్య పరికరాలు వగైరాలకు సంబంధించిన ఒప్పందాలపై సంతకాలయ్యాయి. యూరేషియన్ ఎకనామిక్ జోన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలు పునఃప్రారంభించాలన్న రష్యా ప్రతిపాదనకు భారత్ అంగీకరించింది.

సాధారణంగా వేరే దేశాల మంత్రులు పర్యటించినప్పుడు రష్యా అధ్యక్షుడు పుతిన్ వారిని కలిసే సంప్రదాయం లేదు. కానీ దాన్ని పక్కనబెట్టి ఆయన జైశంకర్‌తో సమావేశం కావటం, తమ దేశంలో పర్యటించాలని ప్రధాని నరేంద్ర మోదీకి ఆహ్వానం పంపటం భారత్‌తో బంధానికి పుతిన్ ఇస్తున్న ప్రాధాన్యతను తెలియబరుస్తోంది. అయితే సమస్యలున్నాయి. ముడి చమురు కొనుగోళ్లకు మన దేశం రూపాయల్లో చెల్లింపులు మొదలు పెట్టినా, దాని అస్థిరత కారణంగా సమస్యలు ఎదుర్కొంటున్నామనీ, అందుకోసం అదనంగా చెల్లించాలనీ రష్యా చమురు సంస్థలు కోరుతున్నాయి. అదింకా పరిష్కారం కావలిసేవుంది.

దౌత్యం ఎంతో క్లిష్టమైనది. అవతలి పక్షంనుంచి కావలసినవి రాబట్టుకోవటం, అదే సమయంలో వారి ఒత్తిళ్లకు తలొగ్గకపోవటం కొన్ని సందర్భాల్లో తప్పనిసరి. కల్లోల సమయాల్లో మరింత చాకచక్యం తప్పనిసరి. వాస్తవానికి భారత్ రష్యా శిఖరాగ్ర సమావేశాలకు ఇరు దేశాల అధినేతలూ హాజరు కావలసివుంది. 2000 సంవత్సరం నుంచి ఈ సంప్రదాయం నిరాటంకంగా కొనసాగుతోంది. కరోనా కారణంగా 2020లో అసలు సమావేశమే జరగలేదు. ఉక్రెయిన్ యుద్ధంతోరెండేళ్లుగా మోదీ శిఖరాగ్ర సమావేశాలకు వెళ్లలేదు. అయినా సరే ఈసారి కూడా జైశంకరే వెళ్లక తప్పలేదు. ఏమాటకు ఆమాటే చెప్పుకోవాలి. రష్యాకు ఒకప్పుడు మనం జూనియర్ భాగస్వామిగా వుండేవాళ్లం.

ఉదాహరణకు 1991 నాటికి రష్యా జీడీపీ 51.80 కోట్ల డాలర్లు కాగా, మన జీడీపీ 27 కోట్ల డాలర్లు. ఇప్పుడు రష్యా జీడీపీ 2 లక్షల 20 వేల కోట్ల డాలర్లయితే, మన జీడీపీ మొత్తం విలువ 3 లక్షల 60 వేల కోట్ల డాలర్లు. అయినా ఇరు దేశాల సంబంధాలూ యధాతథంగా వున్నాయి. పరస్పర విశ్వాసం ప్రాతిపదికగా ఏర్పడే చెలిమి ఎప్పటికీ చెక్కుచెదరదు. ఎన్నో అవాంతరాలనూ, కాలపరీక్షలనూ తట్టుకుని నిలబడిన భారత్ రష్యా సంబంధాలు ముమ్ముందు సైతం ఇదే రీతిలో కొనసాగుతాయని ఆశించాలి.

# మాదక ద్రవ్యాలు అక్రమ రవాణాను అరికట్టాలి

### – జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి లాఠకర్ – చెక్పోస్టులు వద్ద విస్తృత తనిఖీలు జిల్లా ఎస్పీ జి.ఆర్ రాధిక

శ్రీకాకుళం,డిసెంబర్.30. జిల్లాలో మాదకద్రవ్యాలు అక్రమ రవాణాను అరికట్టాలని వివిధ శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి లాఠకర్ ఆదేశించారు.శనివారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలో వర్చువల్ విధానం ద్వార నార్కో కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ గా జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి లాఠకర్, జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక కన్వీనర్ గా నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో సభ్యులుగా ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్, సబ్ కలెక్టర్, ఆర్డీఓలు, డీఈఓ, డీఎంహెచ్, జిల్లా వ్యవసాయాధికారి పాల్గొన్నారు. ఈ కాన్ఫరెన్స్ నందు ముందుగా గత నెలలో జరిగిన జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల, అమలపై కలెక్టర్,ఎస్పీ ఆరా తీశారు. కమిటీ చైర్మన్ కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ అక్రమ రవాణాలను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. రానున్న మూడు నెలల్లో అవసరమైన సిబ్బందిని కేటాయిస్తూ నాటు సారా నిర్మూలనకు చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు, ఎన్ఫోర్స్మెంట్ అధికారులు సమన్వయం చేసుకుంటూ నాట్ సార తయారి అవకాశమున్న ప్రాంతాల్లో రైడ్స్, కార్డన్ చేర్చ్ లు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలోని గంజాయి ఉత్పత్తి లేకపోయినప్పటికీ ఒడిస్సా రాష్ట్రం నుంచి అక్రమంగా రవాణా జరిగే అవకాశం ఉన్నందున చెక్పోస్ట్ లవద్ద తనిఖీలు చేపట్టి గంజాయి అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో నిర్మూలించాలని ఆయన పేర్కొన్నారు. ఒడిస్సా రాష్ట్రం నుంచి తరలించే అక్రమ మద్యాన్ని నియంత్రించెందేకు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలన్నారు.మాదకద్రవ్యాలు వినియోగం వలన కలిగే దుష్ప్రభావాలపై అధికారులు పాఠశాలలు,కళాశాలలో క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. జిల్లా ఎస్పీ రాధిక మాట్లాడుతూ జిల్లా సరిహద్దు కేంద్రాల్లో చెక్పోస్టులు వద్ద సిబ్బందిని ఏర్పాటు చేసి విస్తృతంగా




వాహనాలు తనిఖీ చేయడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. ఇచ్చాపురం, పాతపట్నం చెక్పోస్టులు తోపాటు అదనంగా మారో రెండు చెక్పోస్టులను కోత్తూరు, మెలియపుట్టి వద్ద అంతర్రాష్ట్ర చెక్పోస్టులు ఏర్పాటు చేసి మరింత భద్రత పంచుతున్నమని ఆమె తెలిపారు.జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగం నియంత్రణ చర్యలలో భాగంగా జిల్లా పోలీస్ యంత్రాంగం స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ విభాగం సమన్వయంతో జాయింట్ రైట్స్ నిర్వహిస్తున్నామని అదేవిధంగా రైల్వేస్టేషన్లో బస్ స్టేషన్లు పోలీస్ జాగిలాలతో తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 19 కేంద్రాల్లో మాదక ద్రవ్యాలు వినియోగం వలన కలిగే దుష్ప్రభాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని ఎస్పీ పేర్కొన్నారు.గంజాయి మాదకద్రవ్యాలు వినియోగం లేకుండా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు కార్యాలయం నుంచి ఎస్ఈ బి జెడి ఎన్.మణికంఠ, ఎడిషన్ ఎస్పి విఠలేశ్వర రావు,డి.ఎం.అండ్.హెచ్.ఓ అనురాధ, ఆర్టీసి డీఎం పిబి మల్లిఖర్జురావు, సిఐలు పీ శ్రీనివాస్,ఎస్ఈబి అధికారులు నాగేశరరావు , వర్చ్యుల్ ద్వార ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# విద్య,వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత



పరవాడ:ఏపి సియం వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో విద్య,వైద్యానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ విప్లవాత్మక మార్పులు చేసారని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ అన్నారు.ఈ మేరకు శనివారం అనకాపల్లిజిల్లా మండల కేంద్రం పరవాడ బాలుర జడ్పీ హైస్కూల్లో 8 వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్ తో కూడిన ట్యాబ్ లను ఎమ్మెల్యే ముఖ్య అతిధిగా పాల్గొని ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావు,జడ్పీటీసి పియస్ రాజులతో కలిసి పంపిణీ చేసారు.అనంతరం నూతనంగా ముద్రించిన వైయస్సార్ ఆరోగ్య శ్రీ స్మార్ట్ కార్డులకు కూడా లబ్దిదారులకు పంపిణీ చేసారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత ట్యాబ్ ల ద్వారా డిజిటల్ విప్లవానికి శ్రీకారం చుట్టామని అన్నారు.బైజూస్ కంటెంట్ లోడ్ చేయడం వలన ప్రతి విద్యార్థి పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకోవచ్చున్నారు.మండలంలో 13 పాఠశాలల్లో 8 తరగతి చదువుతున్న 752 విద్యార్థులకు గాను మొదటి విడతగా 300 శామ్సంగ్ ట్యాబ్ లు అందించడం జరిగిందన్నారు.అలాగే ఆరోగ్య శ్రీలో ఉచితంగా పొందే వైద్యాన్ని రూ.25 లక్షలకు పెంచుతూ పేదలకు మరింత ఆరోగ్య భద్రతను సియం జగనన్న కల్పించారని అన్నారు.మండలంలో మొదటి విడతగా 1258 కార్డులకు గాను పరవాడ 832,భరణికం 426 కార్డులు ఇవ్వడం జరిగిందన్నారు. ఇంతటి గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సియం జగనన్నకు ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవా దాలు,కృతజ్ఞతలు తెలియ జేసారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వర్రావు,బూస అప్పలరాజు, స్థానిక సర్పంచ్ సిరిపురపు అప్పల నాయుడు,మండలపార్టీ అధ్యక్షుడు కోన రామారావు,మండల జేసిఎస్ కన్వీనర్ వెన్నెల సన్యాసిరావు,పరవాడ పీహెచ్ సి వైద్యధికారి డాక్టర్ హారిక, డాక్టర్ జయ శ్రీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొడ్డు అప్పలనాయుడు, సి హెచ్ ఒ సాయి రామ్, ఏ ఎన్ ఎమ్ రత్నము మండలంలో గల సర్పంచ్ లు,ఎంపీటీసిలు,వైకాపా ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# కవి సమయం

## మర్రిచెట్టు

ఊడలు నాటే మర్రిచెట్టులా!
ఎంతో ఘన చరిత్రగలది
కాంగ్రెస్‌పార్టీ
మహావృక్షంలా - వృక్షరాజు ఐ ఉంది
ఈ వృక్ష రాజుకు - చాపక్రింద నీరులా చేరి
అనతికాలంలో ప్రాంతీయ పార్టీలుగా వెలసిల్లే
రెండు నాలుకలతో మాట్లాడే నాగుపాములు
వాడి మీద, వీడు
వీడు మీద వాడు చాడీలు చెప్పుకొనే
దీపావళి టపాస్‌కాయలు
ఒక్కొక్క రాష్ట్రానికి
ఒక్కొక్క కళియుగరావణాసుడు గానో!
నరకాసురుడుగానో! తయారై
కాంగ్రెస్ ప్రగతిని - సుస్థిర స్థానాన్ని
భూస్థాపితం చెయ్యాలని చూస్తున్న
చీడపురుగులు
రాష్ట్రాన్ని - రంపపు కోతకోసి
మధ్య తరగతి కుటుంబీకులను
పీడించే - చండాలులు
వీరి మాటలు - చేష్టలు
విన్నా - కన్నా - చెడుగ ప్రవర్తించినా!
ప్రజాభిష్టంపై - భూస్థాపితం తథ్యం
ఈ సంక్షోభానికి కారకులెవ్వరు?
ఆ వెన్నుపోటు దారులెవ్వరు?
ఈ మధ్య తరగతి కుటుంబీకులను
ఆదుకున్న దెవ్వరు?
నువ్వేగదా! మర్రివిత్తువై ఇంతింతై
అంతై మర్రిచెట్టువై
నీ ఊడలు పెకిలించే నరకాసురులను
పథజర్పిన నాడే - నీ స్థానం - సుస్థిరం

రచయిత
యల్.సిద్ధా

# పంచాంగం

| చవితి ఉ. 10.10<br>మఖ పూర్తి (24-00) వ.సా. 5.58ల 7.44 | ఆదివారం<br>31-12-2023 |
|---|---|

a **మేషం** : ఇతరులకు వాహనం ఇవ్వడంవల్ల ఇబ్బందులను ఎదుర్కుంటారు. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు తొలగిపోతాయి. వస్త్ర, బంగారం, వెండి ఫ్యాన్సీ వ్యాపారాల్లో పోటీతత్వం అధికంగా ఉంటుంది. ఉద్యోగరీత్యా దూర ప్రయాణాలు చేయవలసివస్తుంది. కోర్టు వ్యవహారాల్లో ప్లీడరు ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. గృహ నిర్మాణానికి సంబంధించిన ప్లానుకు ఆమోదం లభిస్తుంది.

b **వృషభం** : ఉద్యోగస్తులు, రాజకీయనాయకులు సభలు, సమావేశాలలో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. కానివేళలో ఇతరుల రాక ఇబ్బంది కలిగిస్తుంది. డాక్టర్లు శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు. ప్రముఖులతో పరిచయాలు వ్యాపకాలు అధికమవుతాయి. మిత్రులతో కలిసి షాపింగ్ చేస్తారు.

c **మిథునం** : ఉపాధ్యాయులకు విద్యార్థుల వల్ల సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది జాగ్రత్త వహించండి. స్త్రీలకు అయిన వారి రాక సంతోషం కలిగిస్తుంది. సిమెంటు, కలప, ఐరన్, ఇటుక, ఇసుక వ్యాపారులకు కలిసిరాగలదు. బ్యాంకు రుణాలు తీర్చడంతో పాటు కొంత రుణం తీసుకుంటారు. బంధువుల మధ్య సయోధ్య లోపిస్తుంది

d **కర్కాటకం** : ఆర్థిక లావాదేవీలు, కుటుంబ సమస్యలు సమర్థంగా పరిష్కరిస్తారు. ఉద్యోగస్తులకు అధికారుల తీరు నిరుత్సాహం కలిగిస్తుంది. ఒక అవసరానికి ఉంచిన ధనం మరో ఖర్చుకు వినియోగించవలసి వస్తుంది. స్త్రీలు తేలికగా మోసపోయే ఆస్కారం కలదు. కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు ఒత్తిడి, పనివారలతో చికాకులు తప్పవు..

e **సింహం** : స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయా ణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు.

f **కన్య** : స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయాణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు. పోస్టల్, ఎల్.ఐ.సి, ఏజెంట్లకు పురోభివృద్ధి. వ్యవసాయ, తోటల రంగాల వారికి నూతన ఆలోచనలు స్ఫురిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి.

g **తుల** : స్త్రీలతో కలహములు, అన్ని కార్యముల యందు విఘ్నవ యలు ఎదుర్కొంటారు. కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటి పైనే శ్రద్ధ వహించండి. పత్రికా సిబ్బందికి వార్తల ప్రచురణలో పునరాలోచన మంచిది. ఏ వ్యక్తికీ అతి చనువు ఇవ్వటం మంచిది కాదు. రుణాలు, పెట్టుబడుల కోసం ప్రయత్నిస్తారు.

h **వృశ్చికం** : కుటుంబ అవసరాలకు, మీ సంతానం కోసం ఫీజులు, బిల్లులవు చెల్లిస్తారు. వృత్తుల్లో వారికి గుర్తింపు లభిస్తుంది. ముక్కుసూటిగా పోయే మీ తీరు ఇబ్బందులకు దారితీస్తుంది. ప్రింటింగ్, స్టేషనరీ రంగంలోని వారికి పనివారలతో చికాకులను ఎదుర్కుంటారు.

i **ధనుస్సు** : ప్రింటింగ్ రంగాల వారికి బకాయిల వసూళ్ళలో శ్రమాధిక్యత, ప్రయాసలు తప్పవు. బంధువులకు పెద్దమొత్తంలో ధనసహాయం చేయునపుడు పునరాలోచన అవసరం. దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

j **మకరం** : ఉపాధ్యాయులకు నూతన వాతావరణం, పరిస్థితులు ఆందోళన కలిగిస్తాయి. సంఘంలో పలుకుబడి గల వ్యక్తుల సహకారంతో మీ పనులు సానుకూలమవుతాయి. ఒంటెత్తు పోకడ మంచిది కాదని గమనించండి.యాదృచ్ఛికంగా ఒక పుణ్యక్షేత్రం సందర్శిస్తారు.

k **కుంభం** : స్త్రీలు చీటికి, మాటికి అసహనం, చికాకులు అధికమవుతాయి. అయిన వారిని, ఆప్తులనువిందు భోజనానికి ఆహ్వానిస్తారు. ఆకస్మిక ప్రయాణాలు వాయిదాపడతాయి. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. స్థిరాస్తుల కొనుగోలు యత్నాలు అను కూలిస్తాయి. మీ ఏమరుపాటుతనం, హడావుడి వల్ల వస్తువులు చేజార్చు కుంటారు. వ్యాపారాల్లో కొత్త కొత్త పథకాలతో కొనుగోలు దారు లను ఆకట్టు కుంటారు.

L **మీనం** : ప్రతి చిన్న విషయానికి ఇతరులపై ఆధారపడటం మంచిది కాదు. ప్రైవేటు సంస్థలలోని వారికి యాజమాన్యంతో ఏకీభావం లోపిస్తుంది. భార్య, భర్తల మధ్య మనస్పర్థలు సమసిపోతాయి. వైద్యరంగాల్లోనివారికి శస్త్రచికిత్సల సమయంలో ఏకాగ్రత అవసరం. ఇసుక, భవన నిర్మాణ కాంట్రాక్టర్లకు ఆటుపోట్లు తప్పవు.

# తెదేపా నాయకులపై వైకాపా శ్రేణుల దౌర్జన్యాన్ని ఖండించిన టిడిపి భీమిలి నియోజకవర్గ ఇంచార్జ్ కోరాడ రాజబాబు



భీమునిపట్నం : విజయబాను న్యూస్ అధికార బలంతో మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సమక్షంలో వైకాపా శ్రేణులు స్థానిక తెదేపా నాయకులపై దౌర్జ న్యానికి పాల్పడిన ఘటనను టిడిపి భీమిలి నియోజకవర్గం ఇన్చార్జి కోరాడ రాజబాబు ఖండించారు. శుక్రవారం బాధిత టిడిపి భీమిలి నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు బోయి రమాదేవి కుటుంబ సభ్యులను రాజబాబు పరామర్శించారు. ఈ సందర్భంగా కోరాడ రాజబాబు స్థానిక మీడియాతో మాట్లాడుతూ జీవీఎంసీ 5వ వార్డు పరిధి బోరవానిపాలెం అమ్మవార్ల ఆలయాల సమీపంలో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు భూమి పూజ చేయ దానికి వచ్చిన ఎమ్మెల్యే అవంతి శ్రీనివాస్ కు ఆ ప్రదేశంలో వ్యాయామశాల సరికాదని

పండుగ దినాల్లో ముఖ్యంగా మహిళలు ను ఇబ్బందులకు గురిచేస్తుందని వివరిస్తూ స్థాని కుల నుంచి సంతకాల సేకరణ చేసి గ్రామస్తులతో కలిసి టిడిపి నాయకులు వినతి పత్రం అందజేసారు బోర అప్పల రెడ్డి అనే వ్యక్తి దౌర్జన్యంగా వారిని అడ్డుకొని మహిళా అధ్యక్షురాలు రమాదేవి పై దాడి చేసారు ఇటువంటి సంఘటనలను టిడిపి చూస్తూ ఊరుకోదని తక్షణమే ఎమ్మెల్యేతో దాడికి పాల్పడినపాటు వైకాపా నాయకులు క్షమాపణ చెప్పకుంటే న్యాయస్థానంలో తగిన గుణపాఠం చెబుతామని రాజబాబు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ టిడిపి పార్లమెంటు ఉపాధ్యక్షులు బోయి వెంకటరమణ, టిడిపి నాయకులు కొండపు రాజు, కంబపు కామరాజు, జనసేన నాయకులు టి సూరి తదితరులు పాల్గొన్నారు.

# రుక్మిణి సత్యభామ సమేతంగా శ్రీ వేణుగోపాల స్వామి కళ్యాణం






సాలూరు విజయభాను న్యూస్ డిసెంబరు 30 : పట్టణంలో శ్రీ బాల త్రిపుర సుందరి సహిత శ్రీ పంచముఖేశ్వర స్వామి ఆలయంలో శ్రీ రుక్మిణి, సత్యభామ, శ్రీ వేణుగోపాల స్వామికి సనాతన ధర్మ పరిషత్ వారి ఆధ్వర్యంలో ఘనంగా కళ్యాణం నిర్వహించారు.

ఈ కళ్యాణంలో కోట ఈశ్వరరావు లక్ష్మి దంపతులు, అగ్రహారపు శ్రీనివాసరావు పరిమళ దంపతులచే మరియు పోలిశెట్టి పద్మజ,భక్తులచే ముందుగా శ్రీ వెంకటేశ్వర స్వామి వ్రతం పూజారులు హరి స్వామి, పార్థవ స్వామి, వినయ్ శర్మ, విజయ శర్మ,ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ క్షేత్ర పాలకులైన శ్రీ వేణుగోపాల స్వామి వారికి రుక్మిణి సత్యభామ శ్రీ వేణుగోపాల స్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా సనాతన ధర్మ పరిషత్తు వారి ఆధ్వర్యంలో లోక కళ్యాణం కోసం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో 300 మంది దంపతులు పాల్గొని పూజా కార్యక్రమం నిర్వహించారు. సనాతన ధర్మ పరిషత్ ఫౌండర్ వెలవలపల్లి పంచముఖేశ్వర శర్మ (సుబ్బు గురువు) ఆధ్వర్యంలో వెయ్యి మందికి అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షులు కొలకోటి శంకరరావు, కమిటీ సభ్యులు, శ్రీ లలితా పారాయణం భక్తులు అందరూ పాల్గొన్నారు.

# ఎక్కువ మెత్తంలో పెన్షన్ ఇచ్చే రాష్ట్రం మనది

కాకినాడ : దేశ వ్యాప్తంగా ఏ రాష్ట్రంలో లేని విధంగా ఎక్కువ మెత్తంలో పెన్షన్ ఇచ్చే రాష్ట్రం మనదేనని, అటువంటి పెన్షన్ పెంపు కార్యక్రమంలో భాగంగా జనవరి 3న కాకినాడలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాల్గొనే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను సమన్వయంతో సమగ్రంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.కృతికా శుక్లా వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలోని వివేకానంద సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన 2024– జనివరి 3న వైఎస్సార్ పెన్షన్ కానుక పెంపు కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేస్తున్న రాష్ట్ర ముఖ్య మంత్రి పర్యటనకు చేపట్టవలసిన చర్యలపై ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం0 నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ, ముఖ్యమంత్రి పర్యటనల సమన్వయకర్త తలశిల రఘురాం, కాకినాడ ఎంపి వంగా గీత, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ఎస్పీ ఎస్ సతీష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రజలు, లబ్దిదారులు తరలి వచ్చేందుకు అవసరమైన రవాణా వాహనాలను ఏర్పాటు చేయాలని డీటీసీని ఆదేశించారు. వాహనాల రూట్లు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, బందోస్తు ఏర్పాటలను పోలీస్ శాఖకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనలో రోడ్ షో, బహిరంగ సభల వద్ద పటిష్టమైన బారికేడింగ్ ఏర్పాటుకు రోడ్లు భవనాల ఎస్ఈ ని ఆదేశించారు. హెలిపాడ్, రోడ్ షో, బహిరంగ సభల వద్ద అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక మెడికల్ క్యాంపులు, కాన్వాయ్ లో వైద్యాధికారులతో కూడిన అంబులెన్స్ ఏర్పాటు చేయాని డీఎం అండ్ హెచ్వో కు సూచించారు. బహిరంగ సభ నిర్వహణకు వేదిక, సభాప్రాంగణం ఏర్పాట్లను పెద్దాపురం ఆర్డీవో చేపట్టాలని కోరారు. అలాగే సభాప్రాంగణంకు హాజరైన ప్రజలకు ఆహారం, త్రాగునీరు ఏర్పాటు చేయాలని కాకినాడ మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహణ టెంపరరీ టాయిలెట్లు కూడా ఏర్పాటు చేయాలని కాకినాడ మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా వాహనదారులకు ముందుగానే ఏ ప్రదేశంలో వాహనాలు పార్కింగ్ చేసుకోవాలో సమాచారం అందించాలని ఆయన పోలీసు అధికారులకు సూచించారు. ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి పర్యటన సమన్వయకర్త తలశిల రఘురాం మాట్లాడుతూ సీఎం పర్యటనకు హాజరైయ్యే ప్రజలు, లబ్దిదారులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని సదపాయాలు కల్పించాలని అధికారులను కోరారు. అంతకు ముందు ఆయన ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో కలిసి ముఖ్యమంత్రి పాల్గొనే బహిరంగ ప్రదేశం రంగరాయ క్రీడా మైదానం, హెలిప్యాడ్ నిమిత్తం జిల్లా పోలీసు మైదానం, రోడ్స్ షో నిర్వహించే ప్రదేశాలను పరిశీలించి అవసరమైన ఏర్పాట్లను సూచించారు. సమావేశంలో కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, జెడ్పీ సీఈవో ఎ.రమణారెడ్డి, ఇన్చార్జి డీఆర్వో డీఆర్డీఏ పీడీ కె.శ్రీరమణి, కాకినాడ పెద్దాపురం ఆర్డీవోలు ఇట్ల కిషోర్, జే.సీతారామరావు, డీఎం సివిల్ సప్లయ్ డీ.పుష్పమణి, డీఎం అండ్ హెచ్వో డా జే.నరసింహ నాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా లావణ్య కుమారి, రోడ్డు భవనాల శాఖ ఎస్ఈ హరిప్రసాద్ బాబు, మెప్మా పీడీ బి.ప్రియంవద వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరిజిల్లా లో అసంఘిక కార్యకలాపాలు 80శాతం తగ్గుముఖం

## జిల్లా ఎస్ పి తుహిన్ సిన్హా వెల్లడి




అల్లరిజిల్లా.విజయభాను, న్యూస్.. పాడేరు.. వ్యాప్తంగా 2023 సంవత్స రాలకాలంలో చుస్తే 80 శాతం అసంఘిక కార్యకలాపాలు తగ్గుముఖం పట్టిందని జిల్లా ఎస్ పి తుహిన్ సిన్హా తెలిపారు. శనివారం జిల్లా ఎస్ పి కార్యాలయంలో స్థానిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. గంజాయి కి సంబందించి 266 కేసులు నమోదు చేశామని, ఈ ఏడాది 248.94ఎకరాల గంజాయి సాగు మొక్కలు ద్వాంసం చేశామని, 10290ఎకరాల్లో రైతులకు ప్రత్నమయంగా అంతర్ పంటలు సాగు చేయడానికి అవకాశం కల్పించామని, కొంతమందికి పి డి కేసులు నమోదు చేశామని అన్నారు.7గురు మహోహిస్ట్ లను,3గురు మిలియ సభ్యులు లొంగుబాటు చేశామని,2చోట్ల మహోహిస్ట్ లా దంపు లను రికవరీ చేశామని,నాటు సారాతో 675 అక్రమ మద్యం కేసులు నమోదు చేసి 738మందికి అరెస్ట్ చేశామని అన్నారు.11,422 లీటర్లు నాటు సారాసిజ్ చేసి 1,71,620, లీటర్లు పులుపు ద్వాంసం చేశామని, ఈ ఏడాది 3.3శాతం మానవ హత్యలు తగ్గాయాని,2పొక్స్ కేసులు నమోదు చేశామని, మహిళా పై వేధింపులు కేసులు నమోదు తగ్గుమొఖం పట్టిందని, అన్నారు. కాగా జిల్లా మొత్తం మీద నేర ఆరోపణలు తగ్గడానికి పోలీస్ శాఖ ఎనలేని కృషి చేసిందని కొనియాడారు. ఈ కార్యక్రమనికి ఎస్ బి సి ఐ హిమగిరి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెరుగైన వస్తువులు కల్పించాలనే లక్ష్యం




కాకినాడ : ఆనంద నిలయం వసతి గృహంలోని విద్యార్థులకు మెరుగైన వస్తువులు కల్పించాలనే లక్ష్యంతో సీఎస్ఆర్ నిధులు రూ. 15 లక్షలతో అదనపు వసతి గదులను నిర్మించడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా.కృతికా శుక్లా అన్నారు. శనివారం కాకినాడ రంగరాయ వైద్య కళాశాల దగ్గర ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ బాలుర ఆనంద నిలయంలో కాకినాడ కోరమండల్ ఇంటర్నేషనల్ వారిచే నూతనంగా నిర్మించిన బ్లాక్ ను జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా.. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ, కోరమండల్ అధికారులతో కలిసి ప్రారంభించారు. వసతి గృహంలో విద్యార్థులతో కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరుపులు, ఇతర సామాగ్రిని అందజేసి, పిల్లలందరికీ కలెక్టర్ ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలనే ఉద్దేశంతో కాకినాడ ఆనంద నిలయం అభివృద్ధికి చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) కింద కాకినాడ కోరమండల్ ఇంటర్నేషనల్ వారిచే రూ.15 లక్షల వ్యయంతో అదనపు వసతి బ్లాక్ ను నిర్మించినట్లు ఆమె తెలిపారు. ఇప్పటికే ఆనంద నిలయం విద్యార్థుల విజ్ఞప్తి మేరకు ఆర్.ఓ ఫిల్టర్, వాషింగ్ మెషిన్, టీవీ, ఇతర చిన్న చిన్న వసతులు కల్పించడం జరిగిందన్నారు. ఇంకా అవసరమైన ఇతర సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయడం జరుగుతుందని, ఆనంద నిలయం వసతి గృహంలోని విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి తక్కువ సమయంలో అదనపు బ్లాక్ పనులు పూర్తిచేసి, అందుబాటులోకి తీసుకురావడంలో కోరమండల్ ప్రతినిధులు ప్రత్యేక కృషి చేశారని కలెక్టర్ ఈ సందర్భంగా కోరమండల్ ఇంటర్నేషనల్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలియజేశారు.

కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ జేడీ డీవీ రమణ మూర్తి, సీపీవో పీ.త్రినాథ్, కోరమండల్ ఇంటర్నేషనల్ కాకినాడ యూనిట్ సీహెచ్ శ్రీనివాసు రావు, ఇతర సాంఘిక సంక్షేమ శాఖ సిబ్బంది, ఆనంద నిలయం వసతి గృహం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన మంత్రి జన్ మన్ తో పివిటిజి గ్రామాల అభివృద్ధి

## ఐటిడిఎ పి. ఓ,వి.అభిషేక్



అల్లూరిజిల్లా.. విజయభాను..పాడేరు..న్యూస్.. ప్రధాన మంత్రి జన జాతి అదివాసీ న్యాయ మహా అభియాన్ పథకంతో అదివాసీ (పెవిటి జి) గిరిజన గ్రామాలు సంపూర్ణ అభివృద్ధి చెందుతాయని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ స్పష్టం చేసారు. పథకాలను అదివాసీలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మినుములూరు పంచాయతీ గుర్రగరువు అదివాసీ గ్రామంలో శనివారం నిర్వహించిన ప్రధాన మంత్రి జన్ మన్ పథకం అవగాహన, లబ్దిదారుల నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్ మన్ పథకం లో ప్రతీ పెవిటిజి కుటుంబానికి పక్కా గృహాలు, ఆధార్ కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డులు, సికిల్ సెల్ ఎనిమియా పరీక్షలు, ఉజ్వల్ ఉచిత గ్యాస్ కనెక్షన్లు, ప్రతీ ఇంటికి విద్యుత్ సదుపాయాలు, జీవనోపాదులు మెరుగు పరచడం జరుగుతుందన్నారు. ఈ నెల 30 వతేదీ నుండి జనవరి 16 వరకు పాడేరు ఐటిడి ఏ పరిధిలో 1597 ఏవిటిజి గ్రామాలలో సమగ్రమైన సర్వే చేసి నమోదు చేయడం నిర్వహించడం జరుగుతుందన్నారు.పెవిటిజి గ్రామాలలో గిరిజనుల అవసరాలు, గిరిజన గ్రామాలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై నమోదు చేయడం జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందరికి నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించడానికి ప్రతిష్టాత్మకంగా పథకాలను అమలు చేస్తున్నాయని అన్నారు. గ్యాస్ కనెక్షన్లు లేని పివిటి జిలకు ప్రధాన మంత్రి ఉజ్వలక పథకంలో ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు, ఉచిత వైద్య పొందడానికి ఆయుష్మాన్ భారత్ కార్డులను అందిస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత వైద్యం అందించడానికి ఆరోగ్యశ్రీ పథకంలో రూ.25 లక్షల వరకు వైద్య సేవలు అందిస్తుందన్నారు. జనవరి 15 వ తేదీన ప్రధాన మంత్రి పి ఎం జన్ మన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని అర్హత కలిగిన లబ్దిదారులు పథకాలు పొందడానికి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఎక్కా గృహాలకు రు.2.39 వేల నిధులను లబ్దిదారులకు అందిస్తారని చెప్పారు. ఇళ్లు లేని పీవిటి జిలు ఇల్లు నిర్మించు కోవాలని పేర్కొన్నారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ కార్డులను లబ్దిదారులకు పంపిణీ చేసారు. పథకాలు నమోదు కోసం అవసరమైన నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసారు.ఈ కార్యక్రమంలో ఐటిడి ఏ సహాయ ప్రాజెక్టు అధికారులు వి. ఎస్. ప్రభాకర్, ఎం. వేంకటేశ్వరరావు, గృహ నిర్మాణ శాఖ పిండి, బి. బాబు, డి ఆర్ డి ఏ పిడి వి. మురళి, ఐసిడి ఎస్ పిడి సూర్య లక్ష్మి, ఎంపిడి ఓ నవీన్, ఎల్ డి ఎం రవితేజ, పి. ఎం. యు ప్రొగ్రాం అధికారి రాంగోపాల్, సిడిపి ఓ ఝాన్సీ, ఎటిడబ్ల్యూ ఓ ఎల్. రజని, తాహాశీల్దారు త్రినాధరావు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల్లో విద్యార్థులు రాణించాలి ఎస్టీ కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావు



సాలూరు/పాచిపెంట విజయభాను న్యూస్ డిసెంబరు 30 విద్యార్థులు క్రీడల్లో రాణించాలని రాష్ట్ర ఎస్టీ కమీషన్ ఛైర్మన్ డా డివిజి శంకరరావు అన్నారు. పాచిపెంట మండలం పి కోనవలస గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో జరుగుతున్న అండర్ 17,19 బాలల రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు – 2023 – 24 ముగింపు ఉత్సవాల్లో శనివారం ఎస్టీ కమీషన్ ఛైర్మన్ డి వి జి శంకరరావు మాట్లాడుతూ విద్యార్థులు విద్యాభ్యాసంతో పాటు క్రీడల్లో రాణించాలని తద్వారా శారీరక, మానసిక వికాసం కలుగుతుందన్నారు. మానసిక వికాసం వలన అధ్యయనంపై దృష్టి కలుగుతుందని అన్నారు. ఉన్నత విద్యలు అభ్యసించుటకు శ్రద్ధ వహించాలని, విద్య వలన సామాజిక హోదా కలుగుతుందని ఆయన చెప్పారు. క్రీడల్లో మంచి ఆసక్తి ఉన్న విద్యార్థులు పట్టుదలతో శ్రమించి ఆయా క్రీడల్లో రాణించి జాతీయ అంతర్జాతీయ స్థాయికి వెళ్ళాలని సూచించారు. విద్యార్థులు ఏకాగ్రత కలిగి ఉండాలని అందుకు సాధన చేయాలని చెప్పారు. శాసన మండలి సభ్యులు పి రఘు వర్మ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సాధారణమని, క్రీడా స్ఫూర్తి గొప్పదని అన్నారు. పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి విష్ణు చరణ్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల విద్య కోసం ప్రభుత్వం ఎంతో వెచ్చిస్తుందన్నారు. విద్యార్థులు చదువులోనూ, క్రీడల్లో రాణించాలని అన్నారు. ఇష్టమైన రంగం ఎంపిక చేసుకొని పట్టుదల, ఓర్పుతో కృషి చేయడం మూలంగా అనుకున్నది సాధించగలరని అన్నారు. తమ కుటుంబాల స్థితిగతులు గుర్తెరిగి చదవడం ద్వారా ఉన్నత శిఖరాలకు చేరవచ్చున్నారు.

రానున్న పదవ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి, రాష్ట్రంలో ఆదర్శంగా నిలవాటనికి అన్ని ప్రయత్నాలు చెయ్యాలన్నారు విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమం లో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ సాధికారత అధికారి కె శ్రీనివాస రావు, ఎంపిపి ప్రమీల, స్థానిక నాయకులు డోల బాబ్జి, సర్పంచ్, ఎంపీటీసీ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# కిసాన్ మోర్చా- ఆంధ్రప్రదేశ్



విజయవాడ : విజయవాడ లోని గన్నవరం గ్రామం రోటరీ భవన్ లో రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సమావేశం కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి అధ్యక్షతన సమావేశాల జరిగింది. సమావేశానికి లిముఖ్యఅతిథిగా జాతీయ కిసాన్ మోర్చా అధ్యక్షులు రాజకుమార్ చాహర్ అతిథులుగా రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు పురంధరేశ్వరి జాతయ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు సన్నపురెడ్డి సురేష్ రెడ్డి కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు లిభారతి మోహన్ మరియు తదితర రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా కిసాన్మోర్చా తరుపున కెవిరమణ రాష్ట్ర బ్యాంకింగ్ సెల్ కన్వినర్ & టీం జాతీయ కిసాన్మోర్చా అధ్యక్షులు కి సన్మానం చేయడం జరిగింది. ఈ సమావేశమునకు కిసాన్మోర్చా విశాఖ జిల్లా అధ్యక్షులు పి వి ప్రసాద్ రావ్, ప్రధానకార్యదర్సులు లెంకా శ్రీరామ్, పి వి కృష్ణరావ్ హాజరైతిరి



*22 వ వార్డులో జనసేన పార్టీ వార్డు అధ్యక్షులు పోతు వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో విస్తృతంగా ఓటర్ నమోదు కార్యక్రమం చేపడుతున్నారు ప్రతిరోజు గడువు ఉన్నంతవరకు ఒక్కొక్క ఏరియాలో ఇ కార్యక్రమం నిర్వహిస్తున్నామని. ప్రజలందరూ ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు.*

# ఒత్తిడి నుండి ఉపశమనానికి క్రీడలు ఎంతో ఉపయుక్తం

**– శాసనసభ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి**

**– విజ్జీ స్టేడియంలో "విజయనగరం కింగ్స్" మరియు "పార్వతీపురం పయనీర్స్ " మధ్య క్రికెట్ మ్యాచ్**

**– ఉత్సాహంగా పాల్గొన్న విజయనగరం మరియు పార్వతీపురం మన్యం పోలీసు అధికారులు**



విజయనగరం : పట్టణం విజ్జి స్టేడియం నందు విజయనగరం పోలీసు శాఖకు "విజయనగరం కింగ్స్" మరియు పార్వతీపురం మన్యం పోలీసు శాఖకు చెందిన "పార్వతీపురం పయనీర్స్" మధ్య డిసెంబరు 30న క్రికెట్ మ్యాచ్ రసవత్తరంగా సాగింది. నిరంతర విధులు, ఒత్తిడి నుండి ఉపశమనం పొందేందుకుగాను జిల్లా ఎస్పీ ఎం.దీపిక ఆధ్వర్యంలో విజయనగరం పోలీసు అధికారులు "విజయనగరం కింగ్స్" గాను, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో పార్వతీపురం పోలీసు అధికారులు "పార్వతీపురం పయనీర్స్" గా క్రికెట్ పోటీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ శ్రీ కోలగట్ల వీరభద్రస్వామి మరియు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొని, క్రికెట్ మ్యాచ్ ను ప్రారంభించారు.

ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకరు మాట్లాడుతూ – నిరంతరం విధులను నిర్వహిస్తూ, ఎంతో ఒత్తిడి గురయ్యే పోలీసులు, ఉపశమనం పొందేందుకు విజయనగరం మరియు పార్వతీపురం మన్యం జిల్లాల ఎస్పీలు మంచి ఆలోచనతో పోలీసు అధికారుల్లో ఉత్సాహాన్ని, క్రీడా స్ఫూర్తిని నింపారన్నారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలోను, నేరాలను నిరోధించుటలో జిల్లా ఎస్పీ కృషి అభినందనీయమన్నారు. పోలీసు సిబ్బంది ఫిట్నెస్ మెరుగుపర్చేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రభుత్వం కూడా గ్రామ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు, వారిలోని ప్రతిభను వెలికి తీసేందుకు 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ – ఏడాదిపాటు ఎంతో క్రమశిక్షణతో విధులు నిర్వహించి, కొత్త ఉత్సాహంతో నూతన సంవత్సరంలో కూడా పని చేసే విధంగా పోలీసు అధికారుల్లో ఉత్సాహాన్ని, ఆనందాన్ని నింపేందుకు రెండు జిల్లాల ఎస్పీలు నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రభుత్వం చేపట్టిన 'ఆడుదాం – ఆంధ్రా' స్ఫూర్తితో పోలీసుశాఖ కూడా క్రికెట్ మ్యాచ్ నిర్వహించడం అభినందనీయమన్నారు.


టాస్ గెలిచి బ్యాటింగు ఎంచుకున్న విజయనగరం కింగ్స్ 20 ఓవర్లలో 8 వికెట్లును కోల్పోయి 147 పరుగులు సాధించారు. బ్యాటింగులో ఎస్ఐ నవీన్ పడాల్ 44 బంతులు ఆడి 6 ఫోర్లు, ఒక సిక్స్ తో 58పరుగులు సాధించగా, ఎస్ఐ కె.కె.కె.నాయుడు 16పరుగులు చేసారు. పార్వతీపురం పయనీర్స్ జట్టులో ఎస్ఐ. అనిష్ 4 ఓవర్లు బౌలింగ్ వేసి 3 వికెట్లును పడగొట్టారు. 148 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగు ప్రారంభించిన పార్వతీపురం పయనీర్స్ 18.1 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 149 పరుగురు చేసి విజయం సాధించింది. ప్రొఫెషనల్ క్రికెట్ ను తలపించిన మ్యాచ్ లో ఆద్యంతం ఆసక్తికరంగా మ్యాచ్ రెండు వైపులా మొగ్గుతూ, చివరకు పార్వతీపురం పయనీర్స్ 11 బాల్స్ మిగిలి ఉండగానే విజయం సాధించింది. పార్వతీపురం పయనీర్స్ జట్టులో ఎస్ఐ అనిష్ ఒక సిక్స్, 7 ఫోర్లతో 50 పరుగులు చేయగా, పార్వతీపురం ఎస్పీ విక్రాంత్ పాటిల్ 22 పరుగులు, ఎస్.ఐ అజయ్ 45 పరుగులు చేసి, చక్కటి సహకారాన్ని అందించి, విజయంలో కీలకపాత్ర పోషించారు. ఈ క్రికెట్ మ్యాచ్లో ఎస్ఐ అనిష్కు 'మ్యాన్ ఆఫ్ మ్యాచ్' లభించింది. బెస్ట్ బ్యాట్స్మెన్గా ఎస్ఐ నవీనపడాల్, బెస్ట్ బౌలర్గా సిఐ వెంకటరావు, బెస్ట్ ఫీల్డర్గా ట్రైనీ డిఎస్పీ మహేంద్ర, బెస్ట్ క్యాచర్గా ఎస్ఐ షణ్ముఖరావులు ఎంపికయ్యారు. ముగింపు వేడుకల్లో ఇరు జిల్లాల ఎస్పీలు ఎం.దీపిక మరియు విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ – నూతన సంవత్సర ప్రారంభానికి ముందు విజయనగరం మరియు పార్వతీపురం మన్యం జిల్లాల పోలీసుశాక అధికారుల్లో ఈ క్రికెట్ మ్యాచ్ మంచి ఉత్సాహాన్ని నింపిందన్నారు. ఇరు జట్లకు చెందిన అధికారులు చక్కని క్రీడా స్ఫూర్తితో మంచి ప్రతిభను కనబర్చారని, ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో కూడా సమిష్టిగా పని చేసి, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని పోలీసు అధికారులు, సిబ్బందిని కోరారు.

విజయనగరం పోలీసు కప్ – 2023 విజేతగా నిలిచిన పార్వతీపురం పయనీర్స్ జట్టుకు విన్నర్స్ ట్రోఫీని, విజయనగరం కింగ్స్ జట్టుకు రన్నర్స్ ట్రోఫీని, మెడల్స్ను పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మరియు విజయనగరం జిల్లా ఎస్పీ ఎం. దీపిక అందజేసారు.

ఈ క్రికెట్ మ్యాచ్ లో పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, విజయనగరం జిల్లా ఎస్పీ ఎం. దీపిక, పార్వతీపురం అదనపు ఎస్పీ ఓ. దిలీప్ కిరణ్, పార్వతీపురం ఎఎస్పీ సునీల్ సరోన్, పాలకొండ డిఎస్పీ జి.వి. కృష్ణారావు, ట్రైనీ డిఎస్పీ మహ్మద్ షేక్ అజీజ్, విజయనగరం డిఎస్పీ ఆర్. గోవిందరావు, దిశ డిఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ట్రాఫిక్ డిఎస్పీ డి. విశ్వనాథ్, ఎఆర్ డిఎస్పీ యూనివర్స్, ట్రైనీ డిఎస్పీ మహేంద్ర సిఐలు కె.కె.వి.విజయనాథ్, బి.వెంకటరావు, ఆర్ఎలు శ్రీనివాసరావు, గోపాలనాయుడు, పలువురు ఎస్ఐలు, ఆర్ఎస్లు, ఇతర పోలీసు అధికారులు మరియు సిబ్బంది, పిఈటిలు ఎంతో ఉత్సాహంగా పాల్గోన్నారు.

# భుజబలం కాపాడుకుందాం..!

## నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు తప్పవు..!



మనకు అండగా నిలిచే వ్యక్తిని 'కుడి భుజం' అంటాం. అంగబలానికి, అర్థబలానికి భుజబలం తోడైతే తిరుగేలేదని చెబుతాం. భుజం భుజం కలిపి.. అంటూ సమైక్యతను చాటుతాం. ఈ పద ప్రయోగాలు భుజానికి ఉన్న ప్రాధాన్యాన్ని తెలియజేస్తాయి. భుజం ఆరోగ్యంగా ఉన్నప్పుడే.. శరీరంలో చురుకైన కదలికలు ఉంటాయి. చిన్నాపెద్దా పనులు స్వతంత్రంగా చేసుకోగలం. కానీ చాలామంది భుజానికి సంబంధించిన సమస్యలను నిర్లక్ష్యం చేస్తుంటారు. దీనివల్ల భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు తప్పవని హెచ్చరిస్తున్నారు నిపుణులు.

మనిషి తన పనులు తాను చేసుకోవాలన్నా.. ఉపాధి మార్గాలు వెతుక్కోవాలన్నా కాళ్లూ చేతులూ పనిచేయాలి. ఆ రెండు వ్యవస్థలూ సక్రమంగా ఉంటేనే మనుగడ. మారుతున్న జీవన శైలి, ఆహారపు అలవాట్లు, వాతావరణ కాలుష్యం తదితర కారణాల వల్ల చిన్న వయసులోనే కీళ్లనొప్పుల బారిన పడుతున్నారు చాలామంది. ప్రత్యేకించి మోకాళ్ల నొప్పి, భుజం నొప్పితో బాధపడేవారి సంఖ్య మరింత పెరుగుతున్నది. మోకాళ్ల నొప్పి వయోధికులలో ఎక్కువగా కనిపిస్తుండగా, భుజానికి సంబంధించిన సమస్యలు మాత్రం అన్ని వయసుల వారినీ ఇబ్బంది పెడుతున్నాయి. అదనంగా.. పోషక విలువల లోపాలు, ప్రమాదాల్లో తీవ్ర గాయాలు కూడా భుజాలను శక్తిహీనం చేస్తున్నాయి.

ప్రధాన సమస్యలు ఇవే..

చాలామంది భుజాల సమస్యలను ప్రారంభ దశలో పెద్దగా పట్టించుకోరు. కానీ ఓ దశకు వచ్చేసరికి.. ఓ మోస్తరు వస్తువులను కూడా పైకి లేపలేకపోతారు. చిన్నచిన్న పనులు కూడా చేసుకోలేకపోతారు. ప్రధానంగా నాలుగు రకాల రుగ్మతలు మనల్ని ఇబ్బందిపెడతాయి. అవి..

ఈ సమస్య ప్రధానంగా మధుమేహ రోగుల్లో కనిపిస్తుంది. ఇతరులకూ రావచ్చు. కారణం ఏమైతేనేం, భుజం కీలు చుట్టూ ఉండే 'క్యాప్సుల్' పొర బిగుసుకుపోవడం వల్ల ఫ్రోజెన్ షోల్డర్ సమస్య తలెత్తుతుంది. ఈ ఇబ్బంది 40-60 ఏండ్ల వారిలో అధికం. ప్రమాదకరం కాకపోయినా, దీర్ఘకాలం బాధపెడుతుంది.

**లక్షణాలు**

భుజం బిగుసుకుపోవడం. కదలికలు తగ్గిపోవడం. నిద్రలో తీవ్రమైన భుజం నొప్పి. బట్టలు వేసుకుంటున్నప్పుడు ఇబ్బంది. చేతులు కదిలించలేని పరిస్థితి.

స్నానంలో వీపు రుద్దుకోలేకపోవడం.

నిర్ధారణ పద్ధతి

ఎక్స్‌రే ద్వారా గుర్తించలేం. రోగి లక్షణాలను బట్టి ఎంఆర్ఐ ద్వారా నిర్ధారించే వీలుంది.

**చికిత్సా విధానం**

ప్రారంభ దశలో గుర్తిస్తే చిన్నపాటి వ్యాయామాల ద్వారా నియంత్రణలోకి తీసుకురావచ్చు. ఇంటి దగ్గరే ఫిజియోథెరపీ చేసుకోవచ్చు. సమస్య తీవ్రంగా ఉన్నప్పుడు హైడ్రోడైలటేషన్ పద్ధతిలో ఇంజెక్షన్ సాయంతో ఉపశమనం కలిగించవచ్చు. ఏ పద్ధతులూ పనిచేయనప్పుడు షోల్డర్ ఆర్థోస్కోపీ విధానమే పరిష్కారం.

**షోల్డర్ డిస్‌లొకేషన్**

షోల్డర్ డిస్‌లొకేషన్.. దీన్నే వాడుక భాషలో భుజం కీలు జారడం, భుజం జారడం అంటారు. ఈ సమస్య ఉన్న రోగులలో భుజంలోని బంతిని పోలిన ఓ భాగం.. దాని చుట్టూ ఉండే గూడులోంచి పక్కకు జరుగుతుంది. దీంతో భుజాన్ని కదిపినప్పుడు విపరీతమైన నొప్పి కలుగుతుంది. ఈ సమస్య ఎక్కువగా 15-40 ఏండ్ల వారిలో కనిపిస్తుంది. చేతిని పైకెత్తినప్పుడు, ఆటలు ఆడుతున్నప్పుడు, నిద్రలో బరువంతా ఒకేవైపు వేసినప్పుడు కీలు జారే ఆస్కారం ఉంది. దీనివల్ల అసౌకర్యంగానూ, నొప్పిగానూ ఉంటుంది.


**నిర్ధారణ పద్ధతి**

ఎంఆర్ఐ ద్వారా గుర్తించవచ్చు. లక్షణాలుజి భుజంలో తీవ్రమైన నొప్పి. చెయ్యి పైకెత్తలేక పోవడం. చేతిని కదపలేకపోవడం. బరువులు లేపలేకపోవడం. వ్యాయామం చేయలేకపోవడం. ఆటలు ఆడలేకపోవడం.

**చికిత్సా విధానం**

సాధారణంగా 'ల్యాబ్రమ్' అనే పొర దెబ్బతినడం వల్ల భుజంలోని కీలు గూడు జారిపోతుంది. ఈ సమస్యకు షోల్డర్ ఆర్థోస్కోపీ పద్ధతి ద్వారా చికిత్స చేస్తారు. ఇక్కడ, సాధారణ సర్జరీలా పొడవైన కోత పెట్టకుండా చిన్నపాటి రంధ్రం చేసి కీలును సరిచేస్తారు. ఇది డే కేర్ సర్జరీ. దవాఖానాకు ఉదయం వెళ్లి సాయంత్రానికి డిశ్చార్జ్ అయిపోవచ్చు. ఈ చికిత్సలో కోత ఉండదు కాబట్టి, నొప్పి కూడా తక్కువే. రోగి త్వరగా కోలుకుంటారు. మూడు నాలుగు రోజుల్లోనే సొంతంగా పనులు చేసుకోవచ్చు. క్రీడాకారులు నెలల వ్యవధిలోనే మైదానంలో అడుగుపెట్టవచ్చు. నిక్షేపంగా వ్యాయామాలూ చేసుకోవచ్చు.

షోల్డర్ ఆర్థరైటిస్ లేదా భుజం కీళ్ల అరుగుదల కూడా తీవ్ర సమస్యే. మోకీళ్లు అరిగినట్టే, భుజం కీళ్లు కూడా అరుగు తాయనే విషయం చాలామందికి తెలియదు. అరవై నిండినవారిలో ఈ ఇబ్బంది



అధికంగా కనిపిస్తుంది. షోల్డర్ ఆర్థరైటిస్‌కు వృద్ధాప్యమే తొలి శత్రువు.

లక్షణాలు

క్రమంగా భుజం నొప్పి పెరగడం. కదలికలు తగ్గిపోవడం. భుజం కదులుతున్నప్పుడు ఒక రకమైన శబ్దం. రోజువారీ పనులకు ఇబ్బంది. నిద్రలో భరించలేని నొప్పి.

నిర్ధారణ పద్ధతి

షోల్డర్ అర్థరైటిస్‌ను సాధారణ ఎక్స్‌రేతో నిర్ధారించవచ్చు. ఆ నివేదిక ఆధారంగా భుజంలోని కీళ్ల అరుగుదలను తెలుసుకోవచ్చు.

చికిత్సా విధానం

ప్రారంభదశలో కొన్నిరకాల వ్యాయామాల (ఫిజియోథెరపీ)తో పాటు మందుల ద్వారా ఉపశమనం కలిగించవచ్చు. సమస్య తీవ్రమైపోయి.. భుజం కీళ్లు ఎక్కువ అరుగుదలకు గురైనప్పుడు షోల్డర్ రీప్లేస్‌మెంట్ సర్జరీ తప్పదు. ఆ శస్త్ర చికిత్సతో రోగి సాధారణ స్థితికి వచ్చేస్తారు.


రొటేటర్ కఫ్ టేర్స్ (భుజం కండరాల చీలిక)

షోల్డర్ రొటేటర్ కఫ్ టేర్స్ లేదా భుజం కండరాల చీలికలు అనేవి ప్రమాదాల్లో దెబ్బతగిలినప్పుడు ఏర్పడతాయి. వయసురీత్యా వచ్చే కండరాల బలహీనత వల్ల కూడా ఇలా జరుగుతుంది. ఈ సమస్య ఉన్నప్పుడు చేయి పైకెత్తినప్పుడు నొప్పిగా అనిపిస్తుంది. బరువులు మోయాలంటే విల

విల్లాడి పోతారు. నిర్ధారణ పద్ధతి

ఈ సమస్యను ఎక్స్‌రే ద్వారా గుర్తించలేం. ఎంఆర్ఐ స్కాన్ ద్వారానే కచ్చితంగా నిర్ధారించవచ్చు.

**చికిత్సా విధానం**




భుజం కండరాల్లో చీలిక చిన్నగా ఉన్నప్పుడు.. కొన్ని వ్యాయామాలు, ఇంజెక్షన్ల ద్వారా నయం చేయవచ్చు. సమస్య తీవ్రత పెరిగినప్పుడు.. షోల్డర్ ఆర్థోస్కోపీ పద్ధతిలో కండరాల చీలికను కలపడానికి కుట్టు వేయవచ్చు. లోకల్ అనస్థీషియా ద్వారా లోపాన్ని సరిచేయవచ్చు. ఈ చికిత్సా పద్ధతిలో రోగిని అదే రోజు సాయంత్రానికి డిశ్చార్జ్ చేస్తారు. కాబట్టి, భుజాలకు సంబంధించి ఏ సమస్య ఉన్నా.. ధైర్యంగా చికిత్స చేయించుకోవచ్చు. ఎంత త్వరగా వైద్యులను సంప్రదిస్తే అంత మంచిది. సరైన పోషకాహారం, రోగ్యకరమైన జీవనశైలి ద్వారా ఎముకల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. అన్నన్ని బరువులు మోసే భుజాన్ని రక్షించుకోవడం మన బాధ్యత.

రోజువారీ వ్యాయామాల్లో భుజాల కదలికలకు సంబంధించిన కసరత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలి. మరీ ముఖ్యంగా మధుమేహ రోగులు గుర్తుంచుకోవాల్సిన విషయం ఇది.

క్రీడాకారులు, వ్యాయామం చేసేవారు ప్రారంభంలో భుజాలకు సంబంధించిన వామప్ ఎక్సర్‌సైజులు చేయాలి. వారాలతరబడి భుజం నొప్పి వెంటాడు తున్నప్పుడు నిర్లక్ష్యం చేయకుండా ఆర్థోపెడిక్ సర్జన్‌ను సంప్రదించడం ఉత్తమం. ప్రత్యేకించి క్రీడాకారులు.. మైదానంలో ఏవైనా ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించాలి.

ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆధునిక చికిత్సా పద్ధతుల్లో భుజం నొప్పులకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. చికిత్స కారణంగా భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయనే భయం వద్దు.

శస్త్ర చికిత్స భయంతో నాటు మందులు, అశాస్త్రీయ విధానాలు అనుసరిస్తే.. మొదటికే మోసం వస్తుంది.





# దైవారాధనలో రాగి పాత్ర

ఈ రోజుల్లో కూడా పూజాది కార్యక్రమాలకి వెండి, బంగారు పాత్రలు ఉపయోగించే వారు లేకపోలేదు. అయితే ఒకప్పటికంటే ఇప్పుడు అలాంటివారి సంఖ్య తగ్గిందనే చెప్పాలి. ఇక మధ్యతరగతి వారు కూడా ఇత్తడి - రాగి పాత్రలను వాడటం చాలావరకు తగ్గించారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఎవరి ఇంట్లో చూసినా స్టీలు పాత్రలే దర్శనమిస్తున్నాయి. పూజకి ఉపయోగించే అన్ని రకాల పాత్రలు నేడు స్టీలులోనే కనిపిస్తున్నాయి. నగిషీ కారణంగా స్టీలు ... ఇనుము అనే భావన కలగనీయదు. ఈ కారణంగానే దీని వాడకం అంతకంతకూ పెరుగుతూపోతోంది.అయితే ఇటు ఆరోగ్యపరంగాను ... అటు ఆధ్యాత్మిక పరంగాను స్టీలు పాత్రలను వాడకూడదని శాస్త్రం చెబుతోంది.

**పూజలకు స్టీల్ పనికిరాదు:**

స్తోమత వుంటే వెండి - బంగారం, లేదంటే ఇత్తడి - రాగి పాత్రలను వాడటమే అన్ని విధాలా మంచిదని చెబుతోంది. స్టీలు ( ఇనుము) శని సంబంధమైన లోహం కనుక, దానికి బదులుగా ఇతరలోహాలతో చేసిన పాత్రలను మాత్రమే పూజకు వాడాలనీ, అప్పుడే ఎలాంటి దోషాలు లేని పరిపూర్ణమైన ఫలితాలను పొందవచ్చని స్పష్టం చేస్తోంది.

**రాగితో ఆరోగ్యం బోలెడు:**

గతంలో రాగి చెంబు, రాగి బిందె, రాగి గ్లాసు, రాగి ప్లేటు ఇలా ఎక్కువగా రాగి వస్తువులనే వాడే వారు. కాని నేడు ఫ్యాషన్ ఎక్కువయ్యి ప్లాస్టిక్ వచ్చిపడింది. దాంతో రాగి పాత్రల వాడకం బాగా తగ్గిపోయింది. నీళ్ళు తాగాలంటే ప్లాస్టిక్ బాటిల్స్, లంచ్ బాక్సులు కూడా ప్లాస్టికే. నేటి ఇళ్ళు మొత్తం ప్లాస్టిక్ సామానుల మయమైపోయాయి. అయితే రాగి పాత్రలు వాడడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.

రాగిలో యాంటి బ్యాక్టీరియల్ నేచర్ ఉంటుంది. రాగితో చేసిన పాత్రలలో సూక్ష్మ క్రిములు చేరే అవకాశం ఉండదు. కాబట్టి ఇందులో నిల్వచేసే పదార్థాలు చెడిపోయే అవకాశాలు చాలా తక్కువ.

మనకి వచ్చే చాలా రోగాలకి నీటి కాలుష్యం ముఖ్యమైన కారణం. రాగి పాత్రలలో నీళ్ళు ఉంచితే అందులో క్రిములు చేరే అవకాశం చాలా అరుదు. అందుకే పాత రోజుల్లో రాగి బిందెలు వాడేవారు.

చెవులు కుట్టినప్పుడు కూడా చిన్న పిల్లలకి కొన్ని చోట్ల మొదటిసారి రాగి తీగలు చుడతారు. ఎందుకంటే పుండు పడకుండా ఉండటానికి. రాగికి వున్న ఆంటి బ్యాక్టీరియల్ లక్షణం పిల్లలకు ఆ



ప్రమాదం రాకుండా చేస్తుంది.

గతంలో నీళ్ళు వేడి చేసుకోవడానికి రాగితో చేసిన బాయిలర్లు వాడే వాళ్ళు. ఇందులో వేడి చేసిన నీరు వాడడం వల్ల చర్మ సంబంధిత రోగాలు కూడా తగ్గేవని రుజువు చెయ్యబడ్డాయి.

రాగి చెంబులో రాత్రి నీరు వుంచి పగలు నిద్ర లేవగానే తాగితే చాలా చాలా మంచిది. అలా తాగితే కడు పులో వున్న చెడు అంతా మూత్రం ద్వారా బయటకి వచ్చేస్తుందట. ఈ అలవాటు వల్ల గ్యాస్, కిడ్నీ, లివర్ సమస్యలు కూడా తగ్గిపోతాయి.

బ్రిటిష్‌కి చెందిన ఒక యూనివర్సిటీ వాళ్ళు కూడా రాగిపాత్రలలో ఉంచిన నీటిపై పరిశోధన జరిపి పైన పేర్కొన్న విషయాలు నిజమని నిరూపించారు.

**పరగడుపున రాగి పాత్రలో నీళ్లు:**


రాత్రి రాగి చెంబులో మంచి నీళ్ళు వుంచి పరగడుపున తాగితే హాయిగా జీవించవచ్చు. రాత్రి నిద్ర పోయేముందు అర లీటర్ నుండి లీటర్ ఉండే రాగి చెంబు నిండా మంచినీళ్ళు పోసి మంచం పక్కనే పెట్టుకోవాలి ఉదయం నిద్ర లేచి లేవగానే రెండు సార్లు పుక్కిలించి ఊసి ఆ రాగి చెంబులోని నీళ్లు తాగాలి . దీనివల్ల 15 నిమిషాల నుండి అర గంటలోపు సుఖ విరోచనం అవుతుంది. గ్యాస్, కడుపుబ్బరము, కడుపులో మంట, మలబద్ధకం, తేపులు, మొదలైన బాధలన్నీ ఈ అలవాటుతో ఎటువంటి ఔషదాలు వాడే పని లేకుండా పూర్తిగా తగ్గిపోతాయి. మలబద్ధకం అనేది అన్ని వ్యాధుల్ని కలిగించడానికి మూలకారణం కాబట్టి ఈ అలవాటుతో మలబద్ధకం నివారించుకుంటే హాయిగా జీవించవచ్చు.

**ఘనమైన రాగి చరిత్ర:**

ఇక రాగి చెంబులో నీళ్ళే ఎందుకు తాగాలి వేరేవి ఉన్నాయి కదా అని కొందరికి సందేహం రావచ్చు . రాగి గురించి వరాహ పురాణంలో వివరంగా ఉంది ఈ రాగి ఏడువేల యుగాల క్రితమే విష్ణు మాయ కారణంగా పుట్టింది .

# యోగాతో అనునిత్యం ఆరోగ్యం

తరుచుగా అనారోగ్యాలకు గురయ్యే మహిళలు నిత్యం యోగా చేయడం మూలంగా అరోగ్యం కుదుటపడుతుందని వైద్యులు సూచిస్తున్నారు. వివిధ రకాల యోగాసనాల మూలంగా శరీరం, వమనసు రెండు కూడా ప్రశాంతంగా ఉంటాయని వారంటున్నారు. మానసిక ఒత్తిడిని అధిగమించడానికి యోగా ఎంతోగానో ఉపయోగపడుతుందని, మహిళలు ఇంటి పట్టునే ఉండి ప్రతిరోజు ఈ యోగాను చేయడం మూలంగా అన్ని రకాల సమస్యలు పరిష్కారమవుతాయని వారంటున్నారు. యోగాలో భాగంగా ప్రాణాయామం గురించి ఈ వారం తెలుసుకుందాం.



ప్రాణం + ఆయామం = ప్రాణాయామం. ప్రాణమంటే జీవన శక్తి. ఆయామం అంటే విస్తరింపచేయుట లేక నియంత్రించి ఉంచుట అని అర్థం. పతంజలి మహర్షి ప్రసాదించిన యోగ సూత్ర ప్రకారం శ్వాస, ప్రశ్వాసల్ని నియంత్రించి ఉంచడమే ప్రాణాయామం అని నిర్ధారించడం జరిగింది. లోనికి పీల్చే గాలిని శ్వాస అని, బయటికి వదిలే గాలిని ప్రశ్వాస అని అంటారు. శ్వాస ప్రశ్వాసల్ని నియంత్రించడం, క్రమబద్ధం చేయడం ద్వారా అంతర్గత సూక్ష్మప్రాణాన్ని కూడా అదుపులో ఉంచవచ్చు.

**నియమబద్ధంగా**

నాడీమండలం, రక్త ప్రసార ధమనులు, జీర్ణకోశం, మూత్రకోశం మొదలుగా గల వాటన్నిటి యందు ప్రాణం సంచరిస్తూ ఉంటుంది. ప్రాణాయామం వల్ల వాటన్నింటికి శక్తి, రక్షణ కల్పిస్తాయి. కనుకనే ప్రాణాయామేన యుక్తేన సర్వరోగ క్షయ భవేత్'' అంటే ప్రాణాయామం నియమబద్ధంగా ఆచరిస్తే సర్వరోగాలు హరించిపోతాయి అను సూత్రం ప్రచలితం అయింది. ప్రాణానికి ప్రాణ, అపాన, సమాన, ఉదాన, వ్యానమను 5 రూపాలు ఉన్నాయి. ప్రాణానికి స్థానం హృద యం. అపానానికి స్థానం గుదం. సమానానికి స్థానం నాభి. ఉదనానికి స్థానం కంఠం. వ్యానానికి స్థానం శరీరమంతా. శ్వాసక్రియకు ప్రాణం, విసర్జన క్రియకు అపానం, పాచన క్రియకు సమానం, కంఠశక్తికి ఉదానం, రక్తప్రసార క్రియకు వ్యానం తోడ్పడుతాయి.

**రేచకం-పూరకం**

శ్వాసను బయటకు వదిలే క్రియను రేచకం అని, లోపలకి పీల్చే క్రియను పూరకం అని, లోపల గాలిని ఉంచడాన్ని అంతర్ పూరకం అని, తిరిగి బయ టకి వదిలి ఆపి ఉంచడాన్ని బాహ్యాకుంభకం అని అంటారు. ఈ క్రియలు ప్రాణాయామానికి సాధనాలు. మెడికల్ సైన్స్ ప్రకారం రెండు ముక్కు రంధ్రాల ప్రయోజనం ఒక్కటే. కాని యోగులు ఈ రెండింటికి మధ్య గల భేదం గ్రహించారు. వారి పరిశోధన ప్రకారం కుడి ముక్కు రంధ్రాన్నుంచి నడిచే గాలి కొద్దిగా ఉష్ణం కలిగిస్తుంది. అందువల్ల దీన్ని వారు సూర్య నాడి లేక సూర్య స్వరం అని అన్నారు. అట్లే ఎడమ ముక్కు రంధ్రం ప్రభావం వల్ల చల్లని దనం అందువల్ల దాన్ని చంద్రనాడి లేక చంద్రస్వరం అని అన్నారు. ఈ రెండిటికి మధ్య సమన్వయం సాదించుటకు యోగ శాస్త్రంలో ప్రాధాన్యం ఇవ్వబడింది. హ అను అక్షరం చంద్రుడికి, ట అను అక్షరం సూర్యు డికి గుర్తుగా నిర్ధారించారు. అందువల్ల హఠ యోగం వెలువడింది. హఠ యోగ మంటే చంద్ర సూర్య నాడులకు సంబంధించిన విజ్ఞానం అన్నమాట. హఠం అనగాబలవంతం అనికాదు. ప్రాణాయామ విజ్ఞానమంతా చంద్ర, సూర్య స్వరాలకు సంబంధించినదే.

***ప్రాణాయామం వల్ల కలిగే ప్రయోజనాలు...***

1. ఊపిరితిత్తులు బాగా పనిచేస్తాయి.
2. శరీరానికి ప్రాణవాయువు బాగా లభిస్తుంది.
3 . రక్త శుద్ధి జరిగి అందలి చెడు అంతా బయటికి వెళ్లిపోతుంది.
4 . గుండెకు సత్తువ లభిస్తుంది.
5 . మెదడు చురుగ్గా పనిచేస్తుంది.
6 . ప్రేగులు, నరాలు, నాడులు శుభ్ర పడతాయి.
8 . శరీరం ఆరోగ్యంగా ఉంటుంది.
9 . ఆయుష్షు పెరుగుతుంది. ఇది అన్నిటికంటే మించిన విశేషం.

తీసుకోవలసిన జాగ్రత్తలు

- మైదానంలోగాని, తోటలోగాని, తలుపులు తెరచియున్న గదిలోగాని, కంబళీ లేక బట్ట లేక ఏదేనీ ఆసనం మీద కూర్చొని ప్రాణాయామం చేయాలి.
- గాలి విపరీతంగా వీస్తూ ఉంటే ఆ గాలి మధ్య ప్రాణాయామం చేయకూడదు.- మురికిగా ఉన్న చోట, దుర్వాసన వస్తున్న చోట, పొగ వస్తున్న చోట ప్రాణాయామం చేయకూడదు.
- సిగరెట్టు, బీడి, చుట్టపొగ వస్తున్న చోట ప్రాణాయామం చేయకూడదు.
- పొట్ట నిండుగా ఉన్నపుడు ప్రాణాయామం చేయకూడదు.
- ప్రాణాయామం చేసే ముందు, చేసిన తరువాత కూడా ఇతర యోగాసనాలు వేయవచ్చు. అయితే చివర శవాసనం వేసి కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవాలి.

# నగరాభివృద్ధే ప్రధాన లక్ష్యం

## నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి



విశాఖపట్నం : విశాఖ నగరాభివృద్ధే ప్రధాన లక్ష్యమని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. శనివారం ఆమె 3వ జోన్ 19, 20 వార్డులలోని పలు అభివృద్ధి పనులకు పార్లమెంటు సభ్యులు ఎం.వి.వి సత్యనారాయణ, 20 వ వార్డు కార్పొరేటర్ నెక్కల్ల లక్ష్మి లతో కలిసి శంకుస్థాపన చేశారు . ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ విశాఖనగరాభివృద్ధే ప్రధాన లక్ష్యమని, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సారథ్యంలో విశాఖ సుందర నగరంగా తీర్చిదిద్దబడుతుందని, ఇప్పటికే ప్రతి వార్డులలో కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడమైనదని ఆమె తెలిపారు. శనివారం 19వ వార్డు పెదజాలారిపేట బాబూజీ నగర్ లో సుమారు రూ. 49.00 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి, కురుపాం జంక్షన్ నుండి రాయల్ అపార్ట్మెంట్ వరకు సుమారు రూ. 93.30 లక్షలతో తారు రోడ్ నిర్మాణానికి, 20వ వార్డు మెంటల్ హాస్పిటల్ రోడ్డు వద్ద సుమారు రూ. 49.65 లక్షలతో ప్రహరీ నిర్మాణానికి, ఎంవిపి కాలనీ బృందావనం పార్కులో సుమారు రూ. 95.00 లక్షల వ్యయంతో మౌలిక వసతుల నిర్మాణానికి శంకుస్థాపన చేయడమైనదన్నారు.

అలాగే ప్రజలకు అవసరమయ్యే మౌలిక వసతులు, సంక్షేమ పథకాలు వైయస్సార్ ప్రభుత్వం అందిస్తుందని మేయరు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు, ఇతర వైఎస్ఆర్సిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ పరిధిలో పొగమంచు ఎఫెక్ట్..

## ఆలస్యంగా నడుస్తున్న 80కిపైగా రైళ్లు, విమానాలు

ఢిల్లీ: ఢిల్లీని పొగమంచు వణికిస్తోంది. ఢిల్లీ-ఎన్సీఆర్ పరిధిలో మంచు ప్రభావంతో అనేక రైళ్లు, విమానాలు రద్దు అయ్యాయి. దీంతో ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. శనివారం అత్యల్పంగా 10.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దట్టమైన పొగమంచు కారణంగా భారత వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. “పంజాబ్, హరియాణా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ లకు హై అలర్ట్. డ్రైవింగ్ చేసేవారు చాలా జాగ్రత్తగా ఉండాలి. పొగమంచు వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది” అని ఐఎండీ ఎక్స్ లో పోస్ట్ చేసింది. రైళ్లు, విమానాలను రద్దు చేయడమే కాకుండా కొన్నింటిని దారి మళ్లించినట్లు అధికారులు తెలిపారు. ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఉదయం 8.30 వరకు పరిస్థితులు అనుకూలించకపోవడంతో 80కి పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. కఠినమైన పరిస్థితులనడుమే రాజధానిలోని కర్తవ్య మార్గంలో గణతంత్ర దినోత్సవ పరేడ్ ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.

## అనుమతిలేకుండా ఓ వీధికి నిర్మలా సీతారామన్ పేరు బోర్డును తొలగించిన అధికారులు

పెరంబూర్(చెన్నై): రామనాథపురం జిల్లా లాంధై గ్రామంలో నిర్మలా సీతారామన్ రోడ్డు పేరుతో ఉన్న బోర్డును రహదారుల శాఖ అధికారులు తొలగించారు. లాంధై గ్రామ సమీపంలోని రైల్వే సబ్‌వేకు ప్రత్యామ్నాయంగా ఫ్లైఓవర్ ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత ప్రజలు పదేళ్లుగా కోరుతున్నారు. ఈ నేపథ్యంలో, ఈ సమస్యపై దృష్టి సారించిన కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఆ ప్రాంతంలో ఫ్లై ఓవర్ ఏర్పాటుకు రూ. 17.32 కోట్ల కేటాయించేలా కృషి చేశారు. ఆమెకు కృతజ్ఞతలు తెలిపేలా ఆ ప్రాంతంలోని రోడ్డుకు ఆమె పేరు పెట్టాలని నిర్ణయించిన గ్రామస్తులు, బీజేపీ నేతలు, బుధవారం ఆ ప్రాంతంలో ‘నిర్మలా సీతారామన్ రోడ్డు’ అనే బోర్డును ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో, అనుమతులు లేకుండా బోర్డు ఏర్పాటు చేశారని పేర్కొంటూ ఆ బోర్డును రహదారుల శాఖ అధికారులు తొలగించారు.

## జీవీఎంసీ అదనపు కమిషనర్ శ్రీనివాసరావుకు జాయింట్ డైరెక్టర్ గా పదోన్నతి



విశాఖపట్నం **(విజయభాను న్యూస్)** : మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ నందు అదనపు కమిషనర్ గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ యాదగిరి శ్రీనివాసరావు కు రాష్ట్ర ప్రభుత్వం జాయింట్ డైరెక్టర్ గా హోదాను కల్పిస్తూ ఉత్తర్వులను జారీ చేసియున్నది. ప్రస్తుతం మహా విశాఖ పట్నం నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ హోదాలో విధులు నిర్వహిస్తున్నారు. శ్రీనివాసరావుకు జాయింట్ డైరెక్టర్ స్థాయిని కల్పిస్తూ రాష్ట్ర మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేసియున్నారు. జాయింట్ డైరెక్టర్ హోదాను ప్రభుత్వము కల్పించినందున్ అదనపు కమీషనరు శ్రీనివాస రావును నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, జీవీఎంసీ కి చెందిన ఉన్నతాధికారులు, అధికారులు, ఉద్యోగులు అభినందిం చారు.

# ఖేల్‌రత్న, అర్జున అవార్డులను కర్తవ్యపథ్‌లో వదిలివెళ్లిన వినేశ్ ఫొగాట్



దిల్లీ: భారత మహిళా రెజ్లర్ వినేశ్ ఫొగాట్ అన్నట్టుగానే తనకు వచ్చిన జాతీయ క్రీడా అవార్డులను వెనక్కి ఇచ్చేశారు. శనివారం వినేశ్ దిల్లీలోని కర్తవ్యపథ్ మార్గంలో అర్జున అవార్డు, ఖేల్‌రత్న అవార్డులను వదిలేసి వెళ్లారు. తొలుత వినేశ్ తన అవార్డులను ప్రధానమంత్రి కార్యాలయం వెలుపల వదిలిపెట్టేందుకు ప్రయత్నించారు. అయితే కర్తవ్యపథ్ మార్గం వద్ద ఆమెను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వినేశ్ అవార్డులను కర్తవ్యపథ్ మార్గంలో విడిచివెళ్లారు. బజరంగ్ పునియా కూడా తన పద్మశ్రీ అవార్డును వెనక్కి ఇచ్చేశాడు. కర్తవ్యపథ్ మార్గంలోనే తనకు వచ్చిన అవార్డును వదిలివెళ్లాడు. “ఏ క్రీడాకారుని జీవితంలోనూ ఇలాంటి రోజు రాకూడదు. దేశంలోని మహిళా రెజ్లర్లు కఠిన దశను ఎదుర్కొంటున్నారు” అని బజరంగ్ పునియా, వినేశ్ కర్తవ్యపథ్‌కు వస్తున్న వీడియోని ఎక్స్ (X)లో పోస్ట్ చేశాడు. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల ఆరోపణలపై బ్రిజ్‌భూషణ్ సింగ్‌కు వ్యతిరేకంగా సాక్షి మలిక్, బజ్‌రంగ్ పునియా, వినేశ్ ఫొగాట్ తదితర రెజ్లర్లు తీవ్ర పోరాటం చేసిన సంగతి తెలిసిందే. ఇటీవల డబ్ల్యూఎఫ్ఐ (WFI) ఎన్నికల్లో బ్రిజ్‌భూషణ్ సన్నిహితుడైన సంజయ్ సింగ్ ఎన్నిక కావడాన్ని వీరు నిరసించారు. తాను రెజ్లింగ్ నుంచి వైదొలుగుతున్నట్లు సాక్షి మలిక్ ప్రకటించింది. డెఫ్లింపిక్స్ (బధిరుల ఒలింపిక్స్) పసిడి విజేత వీరేందర్ సింగ్ యాదవ్ కూడా పద్మశ్రీ అవార్డును వెనక్కి ఇచ్చేస్తానని తెలిపాడు. వినేశ్ ఫొగాట్, బజరంగ్ పునియా కూడా తమకు వచ్చిన జాతీయ క్రీడా పురస్కారాలను వెనక్కి ఇచ్చేస్తానని ప్రకటించారు. మరోవైపు.. డబ్ల్యూఎఫ్ఐ కొత్త ప్యానెల్‌ను కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ఇప్పటికే సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

# 700కిపైగా కొత్త కేసులు.. ఏడుగురు మృతి



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా కరోనా మరోసారి విజృంభిస్తోంది. కరోనా వల్ల ఏడుగురు మృతి చెందారని కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ వెల్లడించింది. గడచిన 24 గంటల్లో దేశవ్యాప్తంగా 743 కొత్త కోవిడ్ కేసులు నమోదయ్యాయి. దీంతో యాక్టివ్ కేసుల సంఖ్య 3,997కి పెరిగింది. ఈ వైరస్ వల్ల ఒక్కరోజే కేరళలో ముగ్గురు, కర్ణాటకలో ఇద్దరు, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు రాష్ట్రాల్లో ఒక్కొక్కరు చొప్పున మొత్తం ఏడుగురు చనిపోయారని కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ శనివారం వెల్లడించింది. తాజా మరణాలతో కలిసి ఇప్పటివరకు కరోనా ప్రారంభం నుంచి 5,33,358 మంది వైరస్‌కి బలయ్యారు. కాగా, డిసెంబర్ 29వ తేదీన 41,797 నమూనాలను పరీక్షించినట్లు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ నివేదిక పేర్కొంది.

ఇక డిసెంబర్ 28వ తేదీకల్లా దేశవ్యాప్తంగా కోవిడ్ సబ్ వేరియంట్ జెఎన్.1 కేసులు 145 నమోదయ్యాయని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి.

# జగన్ నాయకత్వంలో అన్ని వర్గాలకు సముచిత స్థానం



విశాఖ రూరల్ : మధురవాడ (విజయభాను న్యూస్) : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాలకు, కులాలకు ప్రాధాన్యత కల్పిస్తున్నారని వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు అన్నారు. మహా విశాఖ 8వ వార్డు పరిధి ఎండాడ, లా కాలేజీ రోడ్డులో ఉన్న పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక అనేక మందికి గుర్తింపు తీసుకొచ్చి, ఉన్నత స్థానాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. ఇటువంటి కోవకే చెందిన సీతంరాజు సుధాకర్ కు బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ గా తరువాత ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా ముఖ్యమంత్రి అవకాశం ఇచ్చారని గుర్తు చేశారు. అంతటి అవకాశం కల్పించిన పార్టీని వదిలి వెళ్ళిపోవడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. ఎంతమంది బయటికి వెళ్లిపోయిన వైసీపీకి వచ్చే నష్టం ఏమీ లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కైవసం చేసుకుని మళ్లీ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని జోస్యం చెప్పారు. సుధాకర్ పార్టీలో ఉంటే భవిష్యత్తులో అనేక అవకాశాలు వచ్చి ఉండేవని, జగన్మోహన్ రెడ్డి ఆ విధంగా ఆయనకు గుర్తింపు నిచ్చారని అన్నారు. పార్టీ నాయకులు ద్రోణంరాజు శ్రీవాత్సవ మాట్లాడుతూ ముఖ్యమంత్రి హోదాలో జగన్మోహన్ రెడ్డి ఎప్పుడూ ఎవరూ చేయని విధంగా అన్ని కులాలకు ప్రాధాన్యత కల్పించారని, అందులో భాగంగానే సీతంరాజు సుధాకర్ కు మంచి హోదా ఇచ్చారని పేర్కొన్నారు, అయితే ఆయన దానిని నిలబెట్టుకోకపోవడం బాధాకరమన్నారు.

తన తండ్రి ద్రోణంరాజు శ్రీనివాస్ కు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి ఓడిపోయినప్పటికీ, విఎంఆర్డిఏ చైర్మన్ గా బాధ్యతలు అప్పగించడం జగన్మోహన్ రెడ్డి ఔన్నత్యాన్ని నిరూపిస్తుందన్నారు. ఏది ఏమైనప్పటికీ ఎవరు పార్టీ నుంచి వెళ్లిపోయిన వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఘనవిజయం సాధిస్తుందని, జగన్మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రజల హృదయాల్లో మరింత చేరువవుతారని అన్నారు.

# విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



ఆంధ్రవిశ్వవిద్యాలయం **(విజయభాను న్యూస్)** : విద్యార్థులు నిరంతరం తమ నైపుణ్యాలను, సామర్థ్యాలను పెంపొందించుకోవాలని ఏయూ ఇంచార్జి వీసీ ఆచార్య కె.సమత అన్నారు. ఏయూ బయోకెమిస్ట్రీ విభాగంలో నిర్వహిస్తున్న జాతీయ వర్క్‌షాప్ బయోకెమిక 2కె23 ముగింపు సమావేశంలో ఆమె పాల్గొన్నారు. విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించే విధంగా వర్క్‌షాప్ నిర్వహణ పట్ల హర్షం వ్యక్తం చేసి అధికారులను అభినందించారు.

కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ ఆచార్య టి.రాఘవ రావు,సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ, బయోకెమిస్ట్రీ విభాగాధిపతి ఆచార్య పి.సుభాషిణి దేవి, హై మీడియా ప్రతినిధి జి.రాజేష్ తదితరులు ప్రసంగించారు. అనంతరం వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు, పరిశోధకులకు వీసీ సర్టిఫికేట్లు ప్రధానం చేశారు.

# ఒకే రోజు రెండు భూకంపాలు.. వణికిన మణిపూర్ ప్రజలు

గ్యాంగ్‌టక్: మణిపూర్ ని శుక్రవారం రాత్రి భారీ భూకంపం వణికించింది. దీంతో స్వల్ప ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉఖ్రుల్ కు 280 కి.మీ.ల దూరంలో ఉన్న మయన్మార్ లో గత రాత్రి 10 గంటలకు 120 కి.మీ. లోతులో భూకంపం సంభవించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ తెలిపింది. రిక్టర్ స్కేల్ పై 4.6 తీవ్రత నమోదైంది. ఒకే రోజులో రెండు భూకంపాలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 1.47 నిమిషాలకు అస్సాంలోని డిబ్రూఘర్‌కు 226 కిలోమీటర్ల దూరంలో 3.5 తీవ్రతతో భూకంపం వచ్చింది. అయితే ఈ విపత్తులో జరిగిన నష్టంపై ఇంకా వివరాలు తెలియరాలేదు. ఇందులో మణిపూర్ హై రిస్క్ జోన్ లో ఉంది. భూకంప ప్రభావిత ప్రాంతాల మ్యాప్ ని అధికారులు విడుదల చేశారు. ఆ ప్రాంత భౌగోళిక పరిస్థితుల కారణంగా తరచూ ప్రకంపనలు వస్తు ఉంటాయని నిపుణులు అంటున్నారు. సెప్టెంబర్‌లో ఉఖ్రుల్‌కు 60 కిలోమీటర్ల దూరంలో 5.1 తీవ్రతతో భూకంపం సంభవించింది.

## పారిశుద్ధ్య పనులకు నేను సైతం అంటూ

# చీపురు పట్టిన నగర మేయర్



విశాఖపట్నం **(విజయభాను న్యూస్)** : రాష్ట్ర వ్యాప్తంగా పారిశుధ్య కార్మికులు సమ్మెలో పాల్గోన్నందున విశాఖ నగరంలో గత కొన్ని రోజులుగా పారిశుద్ధ్య నిర్వహణ పనులకు అంతరాయం కలుగుతున్నందున నాతో పాటు నా కుటుంబ సభ్యులు, కార్పొరేటర్లు, జివిఎంసి యంత్రాంగం అంతా నగర పరిశుభ్రత దృష్ట్యా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత నిస్తూ పారిశుద్ధ్య పనులు నిర్వహించడం జరిగిందని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. శనివారం ఆమె రెండవ జోన్ లో గల ఆరిలోవ, పరిసర ప్రాంతాలలో స్వయంగా పారిశుద్ధ్య పనులను చేపట్టి పలువురికి స్ఫూర్తిని కలిగించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పారిశుద్ధ్య కార్మికులు సమ్మెలో పాల్గొన్న నగరంలో వ్యర్థాలు పేరుకు పోతున్నాయని, వాటిని తొలగించేందుకు ప్రభుత్వ పర్మినెంట్ పారిశుధ్య కార్మికులతో కలిసి ఆరిలోవ ప్రాంతంలో పలు ప్రాంతాలను శుభ్రం చేశామని ఆమె తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తారని, వారితో చర్చలు సఫలీకృతం అవుతాయని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అందుకు పారిశుద్ధ్య కార్మికులు విధులకు హాజరై నగర పరిశుభ్రతకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పారిశుద్ధ కార్మికులు సమ్మెలో ఉన్నందున నగర ప్రజలు జీవీఎంసీ చేస్తున్న ప్రయత్నానికి సహకరించి తమ వ్యర్థాలను జీవీఎంసీ ఏర్పాటు చేసిన డస్ట్ బిన్ లోనే వేయాలని, చెత్తను విచ్చలవిడిగా పడవేయరాదని విజ్ఞప్తి చేశారు. పర్మినెంట్ పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ఆరిలోవ ప్రాంతంలో పలు వార్డులను శనివారం శుభ్రం చేయడం జరిగిందని మేయర్ తెలిపారు. ప్రస్తుతం ప్రైవేటు పద్ధతిన విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికుల విధులకు ఆటంకం కలిగించవద్దని, సమ్మె చేస్తున్న కార్మికులను అడ్డుకుంటూ, వెంటనే సమ్మెకు స్వస్తి చెప్తూ విధుల్లో పాల్గొనేలా.., నివాసిత సంక్షేమ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ - ప్రైవేటు సంస్థలు, వార్డు సభ్యులు, మరీ ముఖ్యంగా నగర ప్రజలు నగరం అపరిశుభ్రతకు గురవుతుందని, తద్వారా వ్యాధులు ప్రబలి ప్రజల ఆరోగ్యానికి భంగం వాటిల్లుతుందని, వారికి వారిస్తూ అవగాహన పరచాలని కమిషనర్ పేర్కొన్నారు. పారిశుధ్య కార్మికులు నిత్యం నిర్వహిస్తున్న విధులు చాలా పవిత్రమైనవని, నగర పరిశుభ్రతకు ,ప్రజలకు అందించవలసిన సేవలలో భాగస్వామ్యం అయ్యి ఉన్నారని గ్రహించాలని, సమ్మెకు స్వస్తి చెబుతూ అందరూ విధుల్లో పాల్గొని పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని సమ్మెలో ఉన్న వారికి మేయర్ విజ్ఞప్తి చేశారు. ఈ పరిశుభ్రత కార్యక్రమంలో 11వ వార్డు వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ గోలగాని శ్రీనివాసరావు, ఇతర వైఎస్ఆర్సిపి నాయకులు, పలువురు స్వచ్ఛంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com